# సంపాదకీయం

## భారత్ 'దోస్త్' కు వెన్నుపోటు పొడిచిన ఫలితం అనుభవిస్తున్న టర్కీ..!

పహల్గాం ఉగ్రదాడి అనంతరం భారత్ – పాక్ మధ్య ఉద్రిక్తతలు ఒక్కసారిగా పెరిగిన సమయంలో.. ఉగ్రవాదులు చేసిన పనిని ప్రపంచ దేశాలు ఖండించాయి. ఉగ్రవాదాన్ని అంతం చేసే విషయంలో భారత్ కు తమ మద్దతును ప్రకటించాయి. అలాంటి పరిస్థితుల నేపథ్యంలో అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో భారత సహాయం పొందిన ఓ దేశం మాత్రం పాక్ కు సహకరించింది. తాజాగా ఆ ప్రతిఫలం అనుభవించిన విషయం తెరపైకి వచ్చింది. అవును... పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ వేళ టర్కీ, అజర్ బైజన్ దేశాలు పాకిస్థాన్ కు మద్దతు ఇచ్చిన సంగతి తెలిసిందే. దీంతో.. ఆ దేశాల పర్యాటక రంగంపై గట్టిగా ప్రతికూల ప్రభావం పడింది. ఇందులో భాగంగా... భారత్ నుంచి ఆయా దేశాలకు వెళ్లే పర్యటకుల సంఖ్య గణనీయంగా పడిపోయింది. ఈ నేపథ్యంలో వెలుగులోకి వచ్చిన తాజా గణాంకాలు ఆ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. వివరాల్లోకి వెళ్తే... కొన్నేళ్ల నుంచి అటు టర్కీ, ఇటు అజర్ బైజన్ దేశాలు భారత్ లో భారీ ప్రచారం చేసి పర్యటకులను పెద్ద ఎత్తున ఆకర్షించాయి. దీంతో పెద్ద సంఖ్యలో భారతీయులు అక్కడికి వెళ్లడం మొదలుపెట్టారు. ఈ క్రమంలో ఆ దేశాల ప్రభుత్వ టూరిజం బోర్డులు భారత మార్కెట్ ను కీలకంగా గుర్తించాయి. ఈ క్రమంలో... ఈ క్రమంలో పాకిస్థాన్ పై భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టింది. ఆ కీలక సమయంలో టర్కీ, అజర్ బైజన్ లు బహిరంగంగానే పాకిస్థాన్ కు మద్దతు తెలిపాయి. దీంతో.. మే నెల నుంచే ఈ రెండు దేశాలకు బుకింగ్స్ ను పర్యటకులు రద్దు చేసుకున్నారు. ఈ సమయంలో... భారత్ కు చెందిన ట్రావెల్ సర్వీస్ ప్రొవైడర్లు కూడా ఈ దేశాలకు బుకింగ్స్ ను నిలిపేసి నిరసన వ్యక్తం చేశారు. అవసరమైతేనే ఆ దేశాలకు ప్రయాణం చేయాలని పర్యటకులకు బుక్కింగ్ సంస్థలు సూచనలు కూడా చేశాయి. దీంతో... అప్పటి వరకూ అజర్ బైజన్ కు వెళ్లే భారతీయుల సంఖ్య ఏటా 33 శాతం వృద్ధి చెందుతూ రాగా.. మే నెల తర్వాత తర్వాత నాలుగు నెలల్లో ఒక్కసారిగా 56 శాతం పతనమైంది. సాధారణంగా ఆ నాలుగు నెలల్లో లక్ష వరకు ఉండాల్సిన పర్యటకుల సంఖ్య 44 వేలకు పడిపోయింది. ఆపరేషన్ సిందూర్ కు ముందు నాలుగు నెలల్లో ఆ దేశానికి 81 వేల మంది భారతీయులు వెళ్లారు. ఇక టర్కీ విషయానికొస్తే... మే నుంచి ఆగస్టు వరకు టర్కీకి వెళ్లే భారతీయుల సంఖ్య మూడో వంతు తగ్గింది. ఈ సీజన్ లో గతేడాది 1.36లక్షల మంది ఆ దేశాన్ని సందర్శించగా.. ఈ సారి ఆ సంఖ్య 90,400కు పరిమితమైంది. ముందు ముందు ఈ ప్రభావం మరింతగా ఉండొచ్చని అంటున్నారు.

**'దోస్తే' మేలు మరిచిన టర్కీ!:** 2023 ఫిబ్రవరి 6న భూకంపవల్ల సిరియాతో పాటు టర్కీ అతలాకుతలం అయ్యింది. ఈ సమయంలో ప్రపంచంలోని అన్ని దేశాల కంటే ముందుగా భారత్ స్పందించింది. టర్కీకి ఆపన్న హస్తం అందించింది. ఆ సమయంలో టర్కీకి భారత ప్రధాని మోడీ సంఘీభావం తెలిపారు. టర్కీ ప్రజలకు భారత్ మద్దతుగా నిలుస్తుందని చెబుతూ.. మృతుల కుటుంబాలకు సంతాపం ప్రకటించారు. అనంతరం... టర్కీకి సహాయం చేయడానికి భారత్ "ఆపరేషన్ దోస్త్"ను ప్రారంభించింది. ఈ సమయంలో... టర్కీకి తక్షణం సహాయ చర్యలు ఏమి అందించాలనే విషయాన్ని నిర్ణయించడానికి ప్రధాని మోడీ సంబంధిత శాఖలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమయంలో 8,45,590 డాలర్ల సహాయ సామాగ్రిని పంపించారు. ఈ సందర్భంగా స్పందించిన టర్కీ రాయబారి ఫిరత్ సునేల్... భారత్ కు కృతజ్ఞతలు తెలిపారు. అవసరంలో నిలబడిన స్నేహితుడే నిజంగా స్నేహితుడని చెప్పుకొచ్చాడు. ఢిల్లీకి ధన్యవాదాలు తెలిపారు. కట్ చేస్తే... ఆపరేషన్ సిందూర్ సమయంలో పాక్ కు మద్దతు తెలిపి భారత్ కు వెన్నుపోటు పొడిచే పనికి పూనుకుంది. ఇప్పుడు అనుభవిస్తుంది!

## మున్సిపల్ పరిధిలో ఘనంగా సదరు ఉత్సవం




శామీర్ పేట, అక్టోబర్ 21( గరుడ వార్త ) : మున్సిపల్ పరిధిలోని యాదవ సోదరుల ఆధ్వర్యంలో ఘనంగా సదర్ ఉత్సవం నిర్వహించారు. శామీర్ పేట మండలం తూంకుంట లోని యాదవ సోదరులు మంగళవారం సదర్ ఉత్సవాన్ని ఎంతో ఉత్సాహంగా జరిపారు. ఈ సదర్ ఉత్సవం లో మాజీ సర్పంచ్ ఎద్దు నాగేష్ యాదవ్ పాల్గొని యాదవ సోదరులతో అలై బలై నిర్వహించారు. తూంకుంట లోని ప్రధాన చౌరస్తాలలో సదర్ ఉత్సవ వేడుకలను నిర్వహించారు.



## వాడ వాడాలా ఘనంగా దీపావళి వేడుకలు





శామీర్ పేట, అక్టోబర్ 21 (గరుడ వార్త) : పూర్వ ఉమ్మడి శామీర్ పేట మండల పరిధిలో ఘనంగా వాడవాడలా దీపావళి వేడుకలను నిర్వహించారు. సోమవారం ఉమ్మడి శామీర్ పేట పేట మండలంలోని తూంకుంట మున్సిపల్, అలియాబాద్ మున్సిపల్, మూడు చింతలపల్లి మున్సిపల్ పర్దిలోని గ్రామాలలో ఎంతో భక్తిశ్రద్ధలతో దీపావళి వేడుకలను జరుపుకున్నారు. దీపావళి పండుగను పురస్కరించుకొని దుకాణ సముదాయాలలో లక్ష్మీ పూజలను ఎంతో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఇళ్ల వద్ద దీపాలను వెలిగించి చిన్న పెద్ద తేడా లేకుండా యువతి, యువకులు, చిన్నారులు బాణాసంచను పేల్చి దీపాలి వేడుకలను జరుపుకున్నారు. బొమ్మల కొలువులను ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు. వాయినాలను ఇచ్చిపుచ్చుకున్నారు. మంగళవారం నోము వ్రతాలను, సత్యనారాయణ స్వామి వ్రతాలను ఎంతో భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు.

## అలియాబాద్ మున్సిపల్ కార్మికులకు నూతన వస్త్రాల పంపిణీ



శామీర్ పేట, అక్టోబర్ 21( గరుడ వార్త) : అలియాబాద్ మున్సిపల్ కార్మికులకు బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు తాళ్ల జగదీష్ గౌడ్ నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. దీపావళి పండగ సందర్భంగా సోమవారం శామీర్ పేట మండలం అలియాబాద్ మున్సిపల్ లో పనిచేస్తున్న కార్మికులకు తాళ్ల జగదీశ్వర్ గౌడ్ నూతన వస్త్రాలను అందజేశారు.

ప్రతి ఏడు లాగే ఈ సంవత్సరం దీపావళికి మున్సిపల్ పారిశుద్ధ కార్మికులకు నూతన వస్త్రాలను అందించారు.



## భక్తిశ్రద్ధలతో మాస శివరాత్రి పూజలు

శామీర్ పేట, అక్టోబర్ 21 (గరుడ వార్త) : భక్తిశ్రద్ధలతో మాస శివరాత్రి పూజలను నిర్వహించారు. ఆదివారం రాత్రి మండల కేంద్రం శామీర్ పేట శ్రీ భవాని రామలింగేశ్వర స్వామి ఆలయంలో (శివాలయం) ఆలయ ప్రధాన అర్చకులు గడియారం మురళీధర్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి రుద్రాభిషేకం, అర్చన, హారతి, మంత్రపుష్పం నిర్వహించారు.

శామీర్ పేట కు చెందిన భజన మండలి సభ్యులు భక్తి గీతాలు ఆలపించారు. భక్తుల సహకారంతో అన్నదానం చేపట్టగా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అన్న ప్రసాదం స్వీకరించారు.

## శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయ ప్రాంగణంలో అన్న ప్రసాద వితరణ



శామీర్ పేట, అక్టోబర్ 21 (గరుడ వార్త) : శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద ఘనంగా అన్న ప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు.

మండల కేంద్రం శామీర్ పేట లోని శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద శామీర్ పేట ఎల్లమ్మ ఆలయం సమీపంలోని ఎస్ ఎస్ సి రెసిడెన్సి అపార్ట్మెంట్ కు చెందిన పోచాద్రి – కమలా దంపతులు, వారి కుటుంబ సభ్యులు అన్నదానం చేపట్టారు. ఎల్లమ్మ తల్లి ఆలయానికి విచ్చేసే భక్తులు, మాజీ ప్రజా ప్రతినిధులు, రాజీవ్ రహదారి పై వెళ్లే భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు.



## పంటలు ముంచి.. ఆశలు తుంచి

నిర్మల్: వరద నీరు సాఫీగా వెళ్లడానికి సాగునీటి కాలువలు సరిగా ఉన్నాయా.. ఏమైనా ఆటంకాలు ఏర్పడుతున్నాయా.. వంటి వాటిపై ఎప్పటికప్పుడు నీటి పారుదలశాఖ అధికారులు పర్యవేక్షణ చేయాలి.. కానీ అవేమీ పట్టించుకోని కారణంగా అన్నదాతలకు శాపంగా మారుతోంది. 2020 సంవత్సరంలో జరిగిన పురపాలిక ఎన్నికలకు ముందు నిర్మల్ మున్సిపాల్టీలో విలీనమైన వెంకటాపూర్ గ్రామ చెరువు అలుగు నీరు మూడు కల్వర్టుల ద్వారా వెళ్లిపోయేది. ఆ కల్వర్టులు నిర్వహణ లేకపోవడంతో రెండు పూర్తిగా దెబ్బతిని ఆనవాళ్లు కోల్పోయాయి. ఉన్న ఒక్కటీ చిన్నగా ఉండటంతో గ్రామ చెరువు అలుగు నీటితోపాటు కద్తాల్ చెరువు అలుగు ఎత్తు పెంచడంతో వరద ఎక్కువై పంటలు దెబ్బతింటున్నాయి. కల్వర్టులు బాగు చేయించాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా అధికారులెవరూ పట్టించుకోవడం లేదంటూ ఆ గ్రామ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**కందకం లేకపోవడమూ కారణమే**

జిల్లాలోని సోన్ నుంచి మామడ మండలం ఆరెపల్లి సమీపం వరకు 30 కిలోమీటర్ల మేర జాతీయ రహదారి 44పై ప్రజల రాకపోకల కోసం 14 అండర్‌పాస్‌లు నిర్మించారు. నిబంధనల ప్రకారం వర్షం




నీటితో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండటానికి అండర్‌పాస్ ఇరువైపులా కందకాల తవ్వకాలు చేపట్టాలి. జిల్లాలో నాలుగైదు చోట్ల మినహా మిగతా ప్రాంతాల్లో ఎక్కడా లేకపోవడంతో ప్రస్తుతం భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వరద ప్రవాహం పక్కనే ఉన్న పంట పొలాల్లోకి చేరడటంతో అన్నదాతలు నష్టపోతున్నారు. రోజుల తరబడి వాటిల్లో నీరు ఉండటంతో పంటలు పూర్తిగా దెబ్బతింటున్నాయి.

**ఏటా నష్టమే**కల్వర్టుల నిర్వహణ లేక ఆనవాళ్లు కోల్పోయాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో గ్రామ చెరువు అలుగు ద్వారా నీటి ప్రవాహం ఎక్కువ కావడంతో నీరు వెళ్లే మార్గం లేక సోయా, వేరుసెనగ, ఆయిల్‌పామ్, వరి పొలాలు కొట్టుకుపోయాయి. వరద నీరు పంట పొలాల్లోకి రాకుండా ఉండటానికి మూతబడ్డ రెండు కల్వర్టులు బాగు చేయించాలి. కొత్తగా మరో మూడు నిర్మించాలి. వెంకట్‌రెడ్డి, రైతు, వెంకటాపూర్

## నిధులు నీళ్లపాలు.. నిర్మాణంలో లోపాలు!

భువనగిరి: కాకతీయుల కాలం నాటి చెరువులకు మరమ్మతులు చేపట్టే పనులు 2017లో ప్రారంభించారు. రూ.కోట్ల నిధులు మంజూరు చేశారు. కానీ పనులను కొన్నిచోట్ల అసంపూర్తిగా వదిలేశారు. దీంతో చెరువులను మినీ ట్యాంక్ బండ్‌లుగా తీర్చిదిద్దాలన్న లక్ష్యం నెరవేరడం లేదు. హైదరాబాద్– భూపాలపట్నం జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న భువనగిరి పెద్ద చెరువును మినీ ట్యాంక్ బండ్‌గా అభివృద్ధి చేసేందుకు 2017లో రూ.6 కోట్ల నిధులు మంజూరు చేశారు. నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన పనులు పూర్తిగా నాసిరకంగా జరిగాయనే విమర్శలున్నాయి. సుమారు రూ.మూడు కోట్ల వరకు ఖర్చు చేసి రెండు కి.మీ పొడవునా కట్టను వెడల్పు చేశారు. నాసిరకంగా పనులు జరగడంతో 2018లో భారీ వానలకు కట్టకుంగి పోయింది. రెయిలింగ్ దెబ్బతింది. రివిట్‌మెంట్ చేయకుండా వదిలేశారు. తదుపరి అభివృద్ధి కోసం హెచ్ఎండీఏకు



కేటాయించడంతో సుందరీకరణ జరిగింది. మరమ్మతులు చేపట్టారు. ఆలేరు మండలం కొలనుపాక పిన్న చెరువును గత ప్రభుత్వం మినీ ట్యాంక్‌బండ్‌గా ఎంపిక చేసింది. చెరువు అభివృద్ధి కోసం రూ.5 కోట్లు మంజూరయ్యాయి. చేపట్టిన పనులు అసంపూర్తిగా మిగిలాయి. 1.8 కి.మీ పొడవున్న కట్టను ఎత్తు, వెడల్పు పెంచి బలోపేతం చేశారు. కట్టకు లోపలి వైపున ఐరన్ గ్రిల్స్ ఏర్పాటు చేశారు. సుమారు రూ.3 కోట్ల పనులు జరగగా..మిగతా రూ.2కోట్ల విలువైన పనులు అటకెక్కాయి. ప్రస్తుతం కట్ట రెండువైపులా కంపచెట్లతో నిండిపోయింది. చౌటుప్పల్ ఊర చెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా నిర్మించేందుకు 2017లో రూ.4 కోట్ల నిధులు మంజూరు చేశారు. సుమారు రూ.కోటి ఖర్చుచేసి చెరువుకట్ట విస్తరణ పనులు చేపట్టారు. చెరువులో పూడిక తొలగించారు. మిగిలిన పనులు చేపట్టలేదు. నిధులు విడుదల చేయకపోవడంతో గుత్తేదారు మిగతా పనులను పూర్తి చేయలేదు.

యాదగిరిగుట్ట మండలంలోని మల్లాపురం, సైదాపురం, గండి చెరువులను గత ప్రభుత్వ హయాంలో మినీ ట్యాంక్‌బండ్‌లుగా అభివృద్ధి చేసేందుకు ఎంపిక చేశారు. రూ.కోట్ల నిధులు కేటాయించి పనులు చేపట్టారు. అవి అసంపూర్తిగా ఉండటంతో స్థానికులకు ఆహ్లాదాన్ని పంచడం లేదు. మోత్కూరులోని పెద్ద చెరువుకు రూ.4.21 కోట్ల నిధులు కేటాయించి మినీ ట్యాంక్ బండ్‌గా తీర్చిదిద్దే పనులు చేపట్టారు. సుమారు రెండు రూ.కోట్లకు పైగా పనులు జరిగాయి. అసంపూర్తిగా నాసిరకంగా చేపట్టడంతో ప్రయోజనం లేకుండా పోయింది. రేయిలింగ్ దెబ్బతింది.

# ఇందిరమ్మ పేరు.. ఇసుకాసురుల తీరు

రామడుగు: రామడుగు పరిధి గుండా ప్రవహించే మోతెవాగు నుంచి ఇసుక అక్రమ రవాణా జోరుగా కొనసాగుతోంది. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు తరలిస్తున్నామని చెబుతూ.. సమీప మండలాలకు అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. కోరిటపల్లి, వన్నారం, రామడుగు, రుద్రారం తదితర గ్రామాల్లో రాత్రి పగలు తేడా లేకుండా ఈ దందా సాగుతోంది.

**మూడు మండలాలకు తరలిస్తూ..**

గత జూన్ వరకు రామడుగు మండలంలో 750 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడంతో లబ్ధిదారులు నిర్మాణ పనులు చేపడుతున్నారు. అయితే మోతెవాగు నుంచి సేకరించే ఇసుకకు అధికారులు ఆటంకం లేకుండా చర్యలు చేపట్టారు. ఇదే అదనుగా అక్రమార్కులు కొత్తపల్లి, గంగాధర, పెగడపల్లి మండలాలకు తరలించి అధిక ధరకు విక్రయించుకుంటున్నారు. నిత్యం వందల సంఖ్యలో ట్రాక్టర్ ట్రిప్పుల ఇసుకను సమీప మండలాలకు తరలిస్తున్నా.. అధికారులు చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారు.

**పడిపోయిన భూగర్భ జలాల మట్టం**

ఇసుక అంతరించి భూగర్భ జలాల మట్టం పడిపోతుందని రైతులు వాపోతున్నారు. గతంలో ఇసుక క్వారీలు ఏర్పాటు చేసేందుకు మైనింగ్ శాఖ అధికారులు సర్వే చేశారు. కానీ ఇసుక అక్రమ రవాణాదారులు



స్థానికులను పురమాయించి క్వారీ ఏర్పాటు చేయకుండా అడ్డుకున్నారు. మరోవైపు డ్రైవర్లు అతి వేగంగా వెళ్తుండటంతో గ్రామాల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి.

**అధికారుల కళ్లు గప్పి..**

ఇసుక నింపిన ట్రాక్టర్ మోతె వాగు నుంచి బయలుదేరిన స్థలం నుంచి గమ్యం చేరేవరకు సెల్‌ఫోన్ల ద్వారా అక్రమ వ్యవహారాన్ని అధికారుల కంట పడకుండా జాగ్రత్త వహిస్తున్నారు. ఒక్కో ఇందిరమ్మ ఇంటికి ప్రభుత్వం 25 క్యూబిక్ మీటర్ల(10ట్రాక్టర్ల) ఇసుకను అనుమతించింది. ఈ లెక్కన ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసిన నెల రోజుల్లోనే రామడుగు మండలానికి సరిపడా ఇసుక రవాణా పూర్తవుతోంది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఈ అక్రమ రవాణా అరికట్టాలని మోతె వాగు పరిసర రైతులు కోరుతున్నారు. దీనిపై తహసీల్దార్ రాజేశ్వరిని వివరణ కోరగా.. గ్రామాల్లో ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారుల అవసరాల మేరకు పంచాయతీ కార్యదర్శులు ఇసుక టోకెన్ జారీ చేస్తున్నట్లు తెలిపారు.

# గంటలో వైద్యం.. ప్రాణాలు భద్రం

గోదావరిఖని: ఉమ్మడి జిల్లాలో రహదారి ప్రమాదాల్లో సగటున రోజుకు ఇద్దరు చొప్పున ప్రాణాలు కోల్పోతున్నారు. నిత్యం ఏదో ఒక చోట రహదారి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. గాయపడ్డ వారికి గంట వ్యవధిలో అత్యవసర చికిత్స అందించడం ద్వారా ప్రాణాలు నిలబెట్టే అవకాశం ఉంటుంది. ఏదైనా ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ప్రాణాపాయంలో ఉన్న వారికి సకాలంలో వైద్య సేవలందించేందుకు 'ట్రామా' కేంద్రాలు పనిచేస్తాయి. సురక్షితమైన భవిష్యత్తు నిర్మించాలన్న లక్ష్యంతో ఈ ఏడాది ప్రపంచ ట్రామా దినోత్సవాన్ని జరుపుకొంటున్నారు.

**ప్రతి 25 కి.మీ.కు ఒకటి**

హైవేలు విస్తరించి ఉన్న ప్రాంతాల్లో ప్రతి 25 కి.మీ.కు ఒక ట్రామా కేంద్రం తప్పనిసరిగా ఏర్పాటు చేయాలి. దీని వల్ల ప్రమాదం ఎక్కడ జరిగినా కేవలం అరగంట వ్యవధిలోనే ట్రామా కేంద్రానికి క్షతగాత్రులను చేర్చే అవకాశం ఉంటుంది. ట్రామా కేంద్రంలో అత్యవసర చికిత్సకు సంబంధించిన వైద్య సౌకర్యాలు, అనుభవజ్ఞులైన వైద్యులు అందుబాటులో ఉండటంతో ప్రమాద బాధితుల ప్రాణాలను కాపాడేందుకు అవకాశం ఉంటుంది.

**ప్రమాద తీవ్రత ఆధారంగా చికిత్స**

ప్రమాదాలు చోటుచేసుకునే సమయంలో చాలా సందర్భాల్లో అవయవాలు కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుంది. తీవ్రరక్తస్రావం కావడంతో పాటు ఊపిరి తీసుకోవడానికి కూడా ఇబ్బంది పడతారు. ఆ సమయంలో వైద్యం అందించేందుకు అందుబాటులో ఆస్పత్రులు ఉండవు. ఒకవేళ ఉన్నా అందులో అధునాతన సౌకర్యాలు, అనుభవజ్ఞులైన వైద్యులు ఉండరు. ఇలాంటి సమయాల్లోనే ట్రామా కేంద్రాలు ప్రాణాపాయంలో ఉన్న వారికి సకాలంలో అత్యవసర చికిత్స అందించేందుకు అవకాశం ఉంటుంది.

**క్రిటికల్ కేర్‌తోనే సరి**

అత్యవసర వైద్యం అందించేందుకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో క్రిటికల్ కేర్ సేవలను అందుబాటులోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. కరీంనగర్ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో క్రిటికల్ కేర్ సేవలు అందుబాటులో ఉన్నాయి. గోదావరిఖని, జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రుల్లో సేవలు అందించేందుకు పనులు తుది దశకు చేరుకొన్నాయి. సిరిసిల్లలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఇంకా క్రిటికల్ కేర్ సేవలు అందించేందుకు పనులు మొదలు పెట్టలేదు.

**ఉమ్మడి జిల్లాలో ఒక్క కేంద్రం లేదు**

ఉమ్మడి జిల్లాలో ఒక్క ట్రామా కేంద్రం కూడా ఏర్పాటు చేయలేదు. గుండ్లపల్లి నుంచి గోదావరిఖని వరకు కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల మీదుగా రాజీవ్ రహదారి 100 కిలోమీటర్లు విస్తరించి ఉంది. ఇటు కరీంనగర్ నుంచి వరంగల్ వరకు 65 కిలోమీటర్లు, జగిత్యాల నుంచి కరీంనగర్, మెట్‌పల్లి నుంచి జగిత్యాల, కరీంనగర్ నుంచి సిరిసిల్ల, జగిత్యాల నుంచి రాయపట్నం వరకు ప్రధాన రహదారులున్నాయి. కరీంనగర్ నుంచి చొప్పదండి మీదుగా రాయపట్నం వరకు ప్రధాన రహదారి ఉంది. పెద్దపల్లి నుంచి మంథని వరకు ఉన్న రహదారుల్లో ఒక్క కూడా ట్రామా కేంద్రం లేదు. కరీంనగర్ జిల్లాలో హుజూరాబాద్, జగిత్యాల జిల్లాలో వెల్గటూరు వద్ద ట్రామా కేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు చేశారు.

**మన చేతుల్లోనే**

కారు డ్రైవింగ్ చేసే సమయంలో సీటుబెల్టు, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలి మద్యం తాగి, చరవాణి మాట్లాడుతూ వాహనాలు నడపకూడదుఅపసవ్య దిశలో ప్రయాణం చేయొద్దు

# పీలిస్తే రోగాలే!



జవహర్‌నగర్ : జవహర్‌నగర్ డంపింగ్ యార్డుతో ప్రజల ప్రాణాలు హరించుకుపోతున్నాయి. పరిసర ప్రాంతాలు కాలుష్య కోరల్లో చిక్కుకుని పీల్చేగాలి విషంగా మారిపోతుంది. బతకడం గగనంగా మారిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రూ.వందల కోట్లు ఖర్చు చేస్తున్నా డంపింగ్ యార్డు కాలుష్యం నుంచి ఉపశమనం లభించడం లేదు. ప్రభుత్వాలు మారుతున్నా శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు పడటం లేదు. నగరంలోని కోటిన్నర ప్రజల నుంచి వచ్చే చెత్తను ఒకే ఒక్క డంపింగ్ యార్డుతో నెట్టుకొస్తున్నారు.

తీవ్ర ప్రభావిత ప్రాంతాలు

కీసర, కాప్రా, ఘట్‌కేసర్, ఉప్పల్ మండల పరిధిలోని సుమారు 20 ప్రాంతాలకుపైగా డంపింగ్ యార్డు కాలుష్యంతో కొట్టుమిట్టాడుతున్నాయి. జవహర్‌నగర్, అంబేద్కర్‌నగర్, ప్రగతినగర్, కార్మికనగర్, రాజీవ్‌గాంధీనగర్, మల్కారం, గబ్బిలాలపేట, చీర్యాల, హరిదాస్‌పల్లి, తిమ్మాయిపల్లి, అహ్మద్‌గూడ, బండ్లగూడ, రాజీవ్ స్వగృహ, డబుల్‌బెడ్ రూం నివాసాలు, దమ్మాయిగూడ, నాగారం, రాంపల్లి ప్రాంతాల్లో సమస్య తీవ్రంగా ఉంది.

రాత్రిళ్లు విషవాయువులతో సతమతం.. యార్డు నుంచి రాత్రిళ్లు గాఢమైన దుర్గంధం వెలువడుతోందని పరిసర ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యర్థాల శాస్త్రీయ నిర్వహణ సామర్థ్యం తగ్గిపోవడంతో ఇబ్బందులు పెరుగుతున్నాయి. పక్కనే ఉన్న మరో గుట్టపై తాజాగా వ్యర్థాలను వేస్తున్నారు. వాయు కాలుష్య తీవ్రత అధికమవుతుంది. దుర్వాసనలతో ఊపిరి పీల్చలేని పరిస్థితి. చర్మ సంబంధిత వ్యాధులు, శ్వాసకోస ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

**దోమలు, ఈగల బెడద ఎక్కువైంది**– అరుణ, గబ్బిలాలపేట

ఇటీవల దోమలు, ఈగలు ఎక్కువయ్యాయి. డంపింగ్ యార్డు నుంచి తీవ్ర దుర్గంధం వస్తుంది. రాత్రిళ్లు కనీసం నిద్రపోలేని పరిస్థితి. అటు మున్సిపల్ అధికారులు, డంపింగ్ యార్డు నిర్వాహకులు మా సమస్యలు పట్టించుకోవడం లేదు.

**పదుల సంఖ్యలో బాధితులు వస్తున్నారు– డా.విజయ్, వైద్యాధికారి, ఆరోగ్యకేంద్రం**

డంపింగ్ యార్డు పరిసర ప్రాంతాల నుంచి శ్వాస సంబంధిత సమస్యలు, జ్వరం బాధితులు పదుల సంఖ్యలో నిత్యం ఆసుపత్రికి వస్తున్నారు. తీవ్రమైన చర్మ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న కేసులు ఇటీవల గుర్తించాం. విషవాయువుల గాఢత ఎక్కువగా ఉండడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

**ఉపశమన చర్యలు తీసుకునేలా చూస్తాం– వసంత, మున్సిపల్ కమిషనర్**

రాంకీ, జీహెచ్ఎంసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లి ఉపశమన చర్యలు తీసుకునేలా చూస్తాం. రాత్రిళ్లు విష రసాయనాలు వెలువడుతున్నాయని తరచూ ఫిర్యాదులు వస్తున్నాయి.

# రూ.కోట్లు వెచ్చించి.. నిర్వహణ విస్మరించి..




పరిగి : పల్లెల్లో పచ్చదనం– పరిశుభ్రత పెంపొందించేందుకు ప్రభుత్వం ప్రతి పంచాయతీకి ట్రాక్టర్లను సమకూర్చింది. ఇందుకోసం రూ.కోట్లలో వెచ్చించి వాటిని కొన్నది. సర్పంచుల పదవీకాలం ముగిసిన తరవాత వాటి నిర్వహణ గాడి తప్పింది. అసలైన లక్ష్యాన్ని విస్మరించి ఇతర పనులకు వాడుకుంటున్నారు. దీంతో గ్రామాల్లో స్వచ్ఛత ప్రశ్నార్థకంగా మారింది. గతంలో యాలాల, పెద్దేముల్ మండలాల్లో కొన్ని ట్రాక్టర్లు ఇసుక తరలించగా.. వికారాబాద్ ప్రాంతంలో కరెంటు స్తంభాలను పాతడానికి వినియోగించుకున్నారు. పరిగి ప్రాంతంలో వ్యక్తిగత అవసరాలకు వాడుకున్నారు. అప్పట్లో కొందరు సర్పంచులు సైతం నిబంధనలను పట్టించుకోకుండా వ్యవహరించారు. ఇప్పటికీ గ్రామాల్లో జరుగుతున్న విందులకు సంబంధించిన పనులకు వినియోగిస్తున్నారు.

**జీపీఎస్ విధానంతో మేలు..**

పరిగి, వికారాబాద్, తాండూరు, కొడంగల్ నియోజకవర్గాల పరిధిలోని పంచాయతీల్లో ప్రతినెలా సుమారు 90– 100 టన్నుల వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నాయి. ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేపడితేనే పల్లెలు పరిశుభ్రంగా తయారవుతాయి. పురపాలికల్లో ఇప్పటికే గ్లోబల్ పొజిషనింగ్ సిస్టం (జీపీఎస్) విధానాన్ని అమలు చేస్తున్నారు. పంచాయతీల్లోనూ వీటిని వ్యక్తిగత అవసరాలకు వినియోగించకుండా ఉండేందుకు ఇది ఎంతగానో దోహదపడనుంది.

**పేరుకుపోతున్న బకాయిలు..**

పంచాయతీ ట్రాక్టర్లపై ఉన్న రుణాలకు సంబంధించిన బకాయిలు పేరుకుపోతున్నాయి. ప్రతినెలా ఒక్కో పంచాయతీ రూ. 10వేల దాకా చెల్లించాలి. 18 నెలలుగా బకాయిలు పేరుకుపోయాయి. డీజిల్ పోసేందుకూ కాసులు లేకపోవడం, నిర్వహణ లోపంతోనూ అవి ఉన్నచోటే పాడవుతున్నాయి. వాటి నిర్వహణకు ప్రతినెలా రూ. 5– 10వేల దాకా ఖర్చు చేయాల్సి ఉంది. ఆశించిన మేరకు సెస్సులు వసూలు కాకపోవడం, వచ్చిన వాటితోనే పారిశుద్ధ్య కార్మికుల జీతభత్యాలతో నెట్టుకొస్తున్నారు.

**వ్యక్తిగతంగా వాడుకుంటే చర్యలు తప్పవు..– పి.జయసుధ, జిల్లా పంచాయతీ అధికారిణి** పంచాయతీ ట్రాక్టర్లను వ్యక్తిగతంగా వినియోగించుకుంటే సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుంటాం. వాటి పర్యవేక్షణ బాధ్యత గ్రామ కార్యదర్శులదే. పంచాయతీలకు నిధులు విడుదలయ్యాక జీపీఎస్‌ను అమలు చేస్తాం.

# వరి కోతలు.. వర్రీ లేకుండా కొనుగోలు!



వికారాబాద్ : కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం విక్రయించడం ఒక ఎత్తయితే, ధాన్యం డబ్బులు రైతుల చేతికందడం మరో ఎత్తు. ధాన్యం విక్రయించిన 48 గంటల్లో అన్నదాతల ఖాతాల్లో నగదు జమ చేస్తామని ప్రభుత్వం ప్రకటిస్తున్నా, పలు కారణాలతో ఈ హామీ ఆచరణలో అమలు కావడం లేదు. జాప్యం లేకుండా డబ్బులు అందించేందుకు జిల్లా పౌర సరఫరాలశాఖ చర్యలు తీసుకుంటోంది. దీంతో రైతులకు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు ప్రయోజనం కలుగనుంది. **తప్పనున్న ఇబ్బందులు...**

పాత విధానంతో రైతులకు ధాన్యం డబ్బులు సకాలంలో చెల్లించేందుకు ఎన్నో ఇబ్బందులు ఎదురయ్యేవి. ఏ చిన్న సమస్యకైనా హైదరాబాద్‌కు వెళ్లి పరిష్కరించుకోవాల్సి ఉండేది. ఈ క్రమంలో ఎన్నో వ్యయప్రయాసలకు గురయ్యేవారు. ప్రస్తుతం కొనుగోళ్లు, చెల్లింపుల వ్యవహారాలను ఆయా జిల్లాలకే ఇవ్వడంతో వరి రైతులకు అవస్థలు తప్పనున్నాయి.

**1.52 లక్షల ఎకరాల్లో సాగు**

వానాకాలం సీజన్‌లో జిల్లాలో 1.52 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయగా, 1.15 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా పెట్టుకున్నారు. డీసీఎంఎస్, ఐకేపీ, ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘాల(పీఏసీఎస్) ఆధ్వర్యంలో కేంద్రాలు పని చేస్తాయి. ధాన్యం కొనుగోలు చేసిన నిర్వాహకులు ట్యాబ్లెట్ పీసీల ద్వారా వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి పౌర సరఫరాలశాఖ జిల్లా మేనేజర్‌కు పంపుతారు. ఆయన పరిశీలించి విడుదల చేస్తారు. ఇందుకోసం పౌర సరఫరాల కార్యాలయంలో ప్రత్యేక కంప్యూటర్లు, ఆపరేటర్లను నియమించుకొని అంతర్జాల సౌకర్యాన్ని సమకూర్చుకున్నారు. తేమ యంత్రం సాయంతో ధాన్యం 'ఏ' గ్రేడ్ రకానికి క్వింటాకు రూ. 2,389, 'బీ' గ్రేడ్‌కు రూ. 2,369 మద్దతు ధర చెల్లించనున్నారు.

**జాప్యం లేకుండా డబ్బులు జమ...– మోహనకృష్ణ, జిల్లా పౌరసరఫరాల మేనేజర్**వరి కోత, నూర్పిళ్లు ఇప్పుడిప్పుడే ప్రారంభమవుతున్నాయి. మరో 20 రోజుల్లో కేంద్రాలకు రైతులు ధాన్యం తీసుకురానున్నారు. కొనుగోలు చేసిన 48 గంటల్లోనే వారి ఖాతాల్లో డబ్బులు జమ చేసేందుకు చర్యలు తీసుకున్నాం. సన్న రకం ధాన్యానికి అదనంగా రూ. 500 బోనస్ డబ్బులను ప్రభుత్వ మార్గదర్శకాలకు జమ చేస్తాం.

# వెలుగుల పర్వం.. రక్షణే కీలకం

జగిత్యాల : దీపావళి అంటేనే బాణసంచా వెలుగులు. చిన్నాపెద్దా ఆనందంగా జరుపుకొనే పండగకు టపాకాయల కొనుగోళ్లు భారీగా జరుగుతాయి. జిల్లావ్యాప్తంగా ఏటా దాదాపు 50 తాత్కాలిక దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు. జగిత్యాలలో 30, ధర్మపురి, కోరుట్ల, మెట్‌పల్లి, రాయికల్, మల్యాల తదితర ప్రాంతాల్లో కలిపి మరో 20 దుకాణాల ద్వారా విక్రయాలు జరుగుతున్నాయి. ఈ ఏడాది ఇప్పటివరకు 45 వరకు దరఖాస్తులు రాగా మరిన్ని వచ్చే అవకాశం ఉంది. ఈ నెల 19 నుంచి 21 వరకు మూడు రోజుల పాటు దుకాణాల ద్వారా బాణసంచా విక్రయాలు జరపనున్నారు

**ఏటా రూ. 2 కోట్ల వ్యాపారం**

పండగ సమయంలో తాత్కాలికంగా ఏర్పాటు చేసుకొనే దుకాణాలతో పాటు శాశ్వత విక్రయాల కోసం జగిత్యాలలో 4, కోరుట్లలో 1, మెట్‌పల్లిలో 1 చొప్పున బాణసంచా దుకాణాలున్నాయి. అన్ని చోట్లా కలిపి ఏటా దాదాపు రూ. 2 కోట్ల వ్యాపారం జరుగుతుందని అంచనా. దీపావళిని మూడు రోజుల పాటు జరుపుకుంటారు. వీటితో పాటు దుకాణాలు, ఇళ్లలో లక్ష్మీ పూజలు నిర్వహిస్తారు. ఈ వేడుక సమయంలో భారీగా బాణసంచా కాలుస్తారు. పండగ సందర్భంగా టపాకాయల కొనుగోలు కోసం పట్టణాల్లో ఒక్కసారిగా జనం వచ్చే అవకాశం ఉండగా అగ్ని ప్రమాద నివారణ చర్యలు నామమాత్రంగా ఉంటున్నాయి. పట్టణాల్లో జనావాసాలకు దూరంగా క్రీడా మైదానాల్లో తాత్కాలిక టెంట్లలో దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు.



**ఇవీ నిబంధనలు**

అగ్నిమాపక శాఖ నిబంధనల ప్రకారం తాత్కాలిక దుకాణం కోసం రేకులతో షెడ్డు వేసుకోవాలి.

దుకాణాల మధ్య మూడు మీటర్ల దూరం ఉండాలి. అయితే పక్కపక్కనే ఏర్పాటు చేస్తుండటం ప్రమాదకరంగా మారింది.

ప్రతి దుకాణం ముందు 100 లీటర్ల నీళ్ల డ్రమ్ము అందుబాటులో ఉంచాలి. ఇసుకతో నింపిన బకెట్ ఉండాలి. దుకాణంలో సిగరెట్, బీడీలు తాగరాదు.

విద్యుత్తు లైట్లు దుకాణంలో కాకుండా ముందు భాగంగా ఏర్పాటు చేసుకోవాలనే నిబంధన ఉన్నా నిర్వాహకులు పాటించడం లేదు.

దుకాణాల వద్ద అగ్నిమాపక వాహనం అందుబాటులో ఉంచుతున్నా మిగతా నిబంధనల అమలుపై పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి.

తాత్కాలిక దుకాణాల్లో రద్దీ అధికంగా ఉండే అవకాశం ఉన్నందున ప్రమాద నివారణకు అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

**నిరంతరం పర్యవేక్షిస్తాం**

–సైదులు, అగ్నిమాపక శాఖ జిల్లా అధికారి

జిల్లాలో నిబంధనలు పాటించని టపాకాయల విక్రయదారులపై చర్యలు తీసుకుంటాం. దుకాణాల వద్ద నీళ్ల డ్రమ్ము, ఇసుక బస్తా అందుబాటులో ఉంచాలి. రద్దీ ఎక్కువ ఉన్న సమయంలో దుకాణం లోపలికి తక్కువ మందినే అనుమతించాలి. నిర్వహణపై మేం నిరంతరం పర్యవేక్షిస్తాం. టోకు దుకాణాలను మరోసారి పరిశీలించి నిబంధనలు అమలయ్యేలా చర్యలు తీసుకుంటాం.

# చక్కెర పరిశ్రమలో మట్టి దొంగలు

మల్లాపూర్: మల్లాపూర్ మండలం ముత్యంపేట చక్కెర పరిశ్రమకు చెందిన స్థలంలో మట్టి అక్రమ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. ఎకరాలకొద్దీ భూమిలో మట్టి తవ్వుతూ రవాణా చేస్తున్నా చర్యలు తీసుకోకపోవడం సందేహాలకు తావిస్తోంది. పదేళ్లుగా లేఆఫ్ కారణంగా పరిశ్రమను మూసివేశారు. క్వార్టర్ల వెనుక పరిశ్రమకు చెందిన భూములున్నాయి. అందులో నుంచి కొందరు మట్టిని తరలిస్తుండగా మరికొందరు భూమిని చదును చేసి సాగు చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు గానీ, పరిశ్రమ యాజమాన్యం గానీ పట్టించుకోకపోవడంపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

**రాత్రింబవళ్లు దర్జాగా..**

పరిశ్రమ పరిధిలో ప్రస్తుతం 204ఎకరాల భూమి ఉంది. ఇందులోనే పరిశ్రమతో పాటు రహదారికి ఉత్తరం వైపు క్వార్టర్లు నిర్మించారు. వాటి వెనకాల దాదాపు 60 ఎకరాల వరకు ఖాళీ స్థలం ఉంది. రహదారికి దూరంగా ఉండటం, నిర్మానుష్యంగా ఉండటంతో రాత్రింబవళ్లు హుస్సేన్‌నగర్ వైపు డి–29 కాలువ వైపు నుంచి మట్టిని తరలిస్తున్నారు.

**సూత్రధారులు ఎవరు?**



పరిశ్రమకు చెందిన దాదాపు మూడు ఎకరాల భూమి నుంచి నిత్యం వేల ట్రిప్పుల మట్టిని తరలిస్తుండటంతో ఆ ప్రాంతం చెరువును తలపిస్తోంది. ఒక్కో చోట 4 మీటర్ల లోతు వరకు మట్టిని పొక్లెయిన్లతో తవ్వి టిప్పర్లు, ట్రాక్టర్లతో తరలించడంతో భారీగా గోతులు ఏర్పడ్డాయి. రోజుల తరబడి మట్టి తరలిస్తున్నా అధికారులు 'మామూలు'గా తీసుకోవడం అనుమానాలకు తావిస్తోంది.

ఇటీవల మొరానికి ఏర్పడిన డిమాండ్ దృష్ట్యా పలువురు అక్రమార్కులు రేయింబవళ్లు మట్టిని తరలిస్తున్నారు.

పరిశ్రమ పరిధిలోని ముత్యంపేట, వేంపేట, చిట్టాపూర్, యుసుఫ్‌నగర్ గ్రామాలకు మట్టిని తరలిస్తున్నారు.

పలుమార్లు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ పట్టించుకోవడం లేదు. మట్టి దందా వెనుక సూత్రధారులు ఎవరు? అన్న ప్రశ్న తలెత్తుతోంది. అధికారులకు ఫిర్యాదు చేస్తున్నాం

–ప్రవీణ్, ఇన్‌ఛార్జి మేనేజర్, ముత్యంపేట పరిశ్రమ

మట్టి తరలింపుపై పలుమార్లు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు చేశాం. వారు పట్టించుకోకపోవడంతో శివారు గ్రామాల వారు తరలిస్తున్నారు. అక్రమార్కులను గుర్తించి కేసులు పెట్టినా తీరు మార్చుకోవడం లేదు.

# మాకింతే చాలు.. ఆక్రమించుకోండి

హైదరాబాద్ : వేల ఎకరాల భూములున్నాయి.. ఒకట్రెండు ఎకరాలు పోయినా పర్లేదని హెచ్‌ఎండీఏ అధికారులు ఉదారత ప్రదర్శిస్తున్నారు. ఘట్‌కేసర్ కూడలిలో రూ.100 కోట్ల విలువైన 3.04 ఎకరాల భూమికి కంచె వేసుకోకుండా ఒక చిన్న నర్సరీ పెట్టుకుని మిగిలిన భూమి తమకు సంబంధం లేదన్నట్టు వ్యవహరిస్తున్నారు. దీంతో కొందరు ప్రైవేటు వ్యక్తులు ఆ భూముల్లో షెడ్లు వేసి కిరాయికిచ్చారు. ఒక్కో షెడ్డు, దుకాణం నుంచి రూ.10వేల వరకూ తీసుకుంటున్నారు. 3.04 ఎకరాల భూమి సరిహద్దులు ఎక్కడున్నాయో వారికి ఇప్పటికీ తెలీదు.

సర్వేనంబర్ 580.. 3.04 ఎకరాలు గాయబ్.. ఘట్‌కేసర్ పట్టణం మీదుగా ఔటర్ కూడలి కోసం రెండు దశాబ్దాల క్రితం ప్రభుత్వం 5.28 ఎకరాలను హెచ్‌ఎండీఏకు ఇచ్చింది. రెవెన్యూ అధికారులు సర్వే నం.580లో భూములను హద్దులతో సహా ఇచ్చారు. ఇందులో 2.24 ఎకరాల్లో హెచ్‌ఎండీఏ కూడలి నిర్మించింది. 3.04 ఎకరాల స్థలాన్ని అలా వదిలేశారు. బాహ్యవలయ రహదారి అందుబాటులోకి రావడం, పదేళ్లలో ఉప్పల్-ఘట్‌కేసర్ మధ్యలో రియల్ వెంచర్లు,



గేటెడ్ కమ్యూనిటీలు పెరగడంతో ఈ స్థలాన్ని సొంతం చేసుకునేందుకు కొందరు ప్రయత్నాలు చేస్తున్నారు. 2019లో ధరణి పోర్టల్‌లో కేవలం 2.24 ఎకరాలు మాత్రమే నిషేధిత జాబితాలో నమోదు కావడంతో మరికొందరు ఈ స్థలానికి పట్టాలు సృష్టించి విక్రయించే ప్రయత్నాలు చేశారు.

**కలెక్టరేట్‌కు కోరితే నిరాకరణ**

ఘట్‌కేసర్ కూడలి వద్ద 3.04 ఎకరాల భూములు ఇవ్వాలని, ఇందులో మేడ్చల్ జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని నిర్మిస్తామని ఐదేళ్ల క్రితం రెవెన్యూ అధికారులు హెచ్‌ఎండీఏను సంప్రదించగా అధికారులు తిరస్కరించారు. అప్పటివరకూ మూడు ఎకరాలు తమవేనని చెప్పుకొన్న హెచ్‌ఎండీఏ తర్వాత వదిలేసింది. రెవెన్యూ రికార్డుల్లో హెచ్‌ఎండీఏ పేరు లేకపోవడంతో అక్రమార్కులు స్థలాన్ని ఆక్రమించుకున్నారు. ఆ స్థలం తమదేనంటూ అధికారికంగా ఈ రోజు వరకు సూచికల బోర్డులు ఏర్పాటు చేయలేదు. కంచెనూ వేయలేదు.

## మురుగు పారే చోట.. ఆహారమా?

హైదరాబాద్: ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు అందించే ఆహార నాణ్యతపై వైద్యారోగ్య శాఖ దృష్టి సారించింది. ఫుడ్ ఇన్‌స్పెక్టర్ల ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు తనిఖీలు చేపడుతున్నాయి. నిలోఫర్‌లో అపరిశుభ్ర వాతావరణంలో ఆహారం అందిస్తున్నారు. మురుగు పారుతున్న ప్రదేశంలో పిల్లలకు, బాలింతలకు ఆహారం అందిస్తున్నట్లు తనిఖీల్లో గుర్తించిన అధికారులు వెంటనే గుత్తేదారుకు నోటీసిచ్చారు. విచారణ తర్వాత సదరు కాంట్రాక్టర్‌పై వేటేయనున్నట్లు తెలుస్తోంది.

**పెద్దాసుపత్రుల్లోనూ అదే తీరు..**గాంధీ, ఉస్మానియా ఇతర ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు ఇచ్చే ఆహార నాణ్యతపై కొంతకాలంగా ఫిర్యాదులు అందుతున్నాయి. గుత్తేదారులు.. ఆసుపత్రి సిబ్బంది కుమ్మక్కై నిధులు స్వాహా చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికే



ఎర్రగడ్డలోని ఆయుర్వేద ఆసుపత్రిలో రోగులకు అందించే ఆహారంలో కుంభకోణం బయటపడింది. రికార్డుల్లో రోగుల పేర్లు రాసి.. ఆహారం ఇవ్వకుండానే ఆ నిధులు పక్కదారి పట్టినట్లు స్పష్టమైంది. కానీ ఇంతవరకు చర్యలు తీసుకోలేదు. మిగతా ఆసుపత్రుల్లోనూ ఇదే పరిస్థితి. 6 నెలల క్రితం ఎర్రగడ్డ మానసిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు అందించే భోజనం కల్తీ జరగడంతో ఓ రోగి మృతిచెందారు. 100 మందికిపైగా ఆసుపత్రిలో చికిత్స పొందారు.

## మారనున్న దారుల రూపు




కరీంనగర్: ఎట్టకేలకు కీలకమైన రహదారుల రూపురేఖలు మారనున్నాయి.రాష్ట్ర మంత్రివర్గం పెద్దఎత్తున రోడ్ల నిర్మాణానికి ఆమోదముద్ర వేయడంతో ఉమ్మడి జిల్లా నుంచి పంపిన ప్రతిపాదనలకు మోక్షం లభించింది. రహదారులు, భవనాల శాఖ పరిధిలో చాలా చోట్ల రోడ్లు గడిచిన కొన్నేళ్లుగా దెబ్బతిన్నాయి. భారీ వర్షాలకు రూపును కోల్పోయా యి. వీటిని హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హ్యామ్) విధానంలో నిర్మించాలని రాష్ట్ర సర్కారు కొన్నాళ్లుగా భావిస్తోంది. దీనికింద నిధులను రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం చెల్లిస్తే గుత్తేదారు 60 శాతం వెచ్చించాల్సి ఉంటుంది. గుత్తేదారుకు 15 ఏళ్లపాటు విడతల వారీగా సర్కారు ఆ మొత్తాన్ని చెల్లించనుంది. అయితే పలు ప్యాకేజీలుగా గుర్తించిన వీటికి త్వరలోనే టెండర్లు పిలవనున్నారు.

**రూ.871.74 కోట్లతో..**

నాలుగు జిల్లాల పరిధిలో రూ.871.74 కోట్లతో రహదారుల నిర్మాణాలు చేపట్టనున్నారు. మొత్తంగా 521 కి.మీ.ల మేర 47 రహదారులను బాగు చేయాలని ఇంజినీరింగ్ అధికారులు గతంలో ప్రతిపాదించారు. ఇటీవల ఇన్‌ఛార్జి మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు నిర్వహించిన సమీక్షలోనూ ఎమ్మెల్యేలు పలు మండలాల్లో ఉన్న రోడ్ల దుస్థితిని విన్నవించారు. వర్షాలకు దెబ్బతిన్న మార్గాల్లో చేపట్టాల్సిన మరమ్మతులతోపాటు కొత్తవాటి గురించి ప్రస్తావించారు. పలుచోట్ల చిన్న వంతెనల నిర్మాణం గురించి అభ్యర్థించారు.

# 20 నెలల్లో.. రూ. వెయ్యి కోట్లు



హైదరాబాద్: వాట్సప్, ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన వ్యక్తుల మాటలు నమ్మి స్టాక్ మార్కెట్లో పెట్టుబడులు పెడతామా..? రూ.లక్షకు రూ.10 లక్షల లాభం వస్తుందని ఆశపెడితే నమ్మేస్తామా..? కొందరు మాత్రం కనీస ఆరా తీయకుండా రూ.కోట్లు సమర్పించుకుంటున్నారు. స్టాక్ మార్కెట్లో పెట్టుబడి పేరుతో రాష్ట్రంలో భారీ మోసాలు జరుగుతున్నాయి. 2024లో 5,359 కేసులు నమోదవగా.. ఈ ఏడాది ఆగస్టు చివరి నాటికి 4,304 కేసులు నమోదయ్యాయి. మొత్తంగా ఇరవై నెలల్లో దాదాపు రూ.వెయ్యి కోట్ల మేర నష్టపోయారు. ముఖ్యంగా హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ల పరిధిలో ఈ తరహా మోసాలు అధికశాతం నమోదవడం ఆందోళన కలిగిస్తోంది.

**ఆన్‌లైన్‌లో పరిచయంతోనే..**

సైబర్ నేరగాళ్లు ప్రధానంగా సామాజిక మాధ్యమాల్లో పరిచయాలు, ఆన్‌లైన్‌లో ప్రకటనలతో ఈ మోసాలు చేస్తున్నారు. ట్రేడింగ్‌లో సలహాలు ఇస్తామంటూ వాట్సప్ గ్రూపుల్లో చేరుస్తున్నారు. ఈ గ్రూపుల్లో అప్పటికే ఉన్నవారంతా.. తాము రెట్టింపు లాభం సంపాదించామంటూ నకిలీ స్క్రీన్‌షాట్లను పోస్టు చేస్తుంటారు. ఇది నమ్మి కొందరు తొలుత రూ.వేలల్లో పెట్టుబడి పెట్టగా.. రెండు మూడింతలు లాభాలు ఇస్తున్నారు. ఆ తర్వాత రూ.కోట్లలో పెట్టుబడి పెట్టించి మోసం చేస్తున్నారు. హైదరాబాద్‌కు చెందిన విశ్రాంత ఉద్యోగి రూ.45 వేల పెట్టుబడికి రూ.8,600 లాభం రావడాన్ని నమ్మి.. 65 రోజుల్లో రూ.7.11 కోట్లు బదిలీ చేసి మోసపోయాడు.

**వలపు వలకు చిక్కి..**

హనీట్రాప్ చేసి డబ్బు కొట్టేస్తున్నారు. యువతుల పేర్లతో నకిలీ ప్రొఫైలు తయారుచేసి సందేశాలు పంపిస్తున్నారు. ఎవరైనా నమ్మి బదులిస్తే తియ్యటి మాటలతో ముగ్గులోకి దించుతున్నారు. తాను ట్రేడింగ్ చేస్తున్నట్లు నమ్మిస్తారు. వేగంగా సంపాదించడానికి మార్గమంటూ నకిలీ వెబ్‌సైట్, యాప్ లింకులు పంపిస్తున్నారు. నిజమేనని భావించి ఎక్కువ మంది మోసపోతున్నారు.

**ఈ జాగ్రత్తలు తప్పనిసరి**

స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడికి నిర్దేశిత ఖాతాలుంటాయి. వ్యక్తిగత ఖాతాలకు డబ్బు బదిలీ చేయమని సూచిస్తే కచ్చితంగా మోసమని తెలుసుకోవాలి.సోషల్ మీడియాలో వచ్చే రీల్స్, ప్రకటనలను.. వాట్సప్‌లో వచ్చే లింకుల్ని చూసి పెట్టుబడులు పెట్టొద్దు.

అనుమతి లేకుండా వాట్సప్, టెలిగ్రామ్ గ్రూపుల్లో చేరిస్తే వెంటనే లెఫ్ట్ అవ్వాలి.నేరగాళ్ల చేతితో మోసపోయి డబ్బు కోల్పోతే ఆలస్యం చేయకుండా 1930 టోల్‌ఫ్రీకి ఫిర్యాదు చేయాలి.

# స్టేషన్లు చేరాలంటే బస్సులు మారాల్సిందే



హైదరాబాద్: సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ అభివృద్ధి పనుల కారణంగా కొన్ని రైళ్ల టెర్మినళ్లను మార్పులు చేశారు. దీంతో ప్రయాణికులు రెండు లేదా మూడు బస్సులు మారి స్టేషన్లను చేరుకోవాల్సి వస్తోంది. దీనికి బదులుగా మూడు స్టేషన్లను కలుపుతూ గమ్యం చేరుకునేలా నైట్‌హాల్టింగ్ కల్పిస్తే సమస్య పరిష్కారమవుతుందని ప్రయాణికులు అంటున్నారు.

**చర్లపల్లి నుంచి ప్రారంభిస్తే...**

మల్కాజిగిరి నుంచి కర్నూల్‌కు నిత్యం రాకపోకలు సాగించే ప్రయాణికులు వందల సంఖ్యలో ఉన్నారు. గతంలో వీరంతా ఉదయాన్నే సికింద్రాబాద్ స్టేషన్‌కు వెళ్లి అక్కడినుంచి కర్నూల్, ఇతర ప్రాంతాలకు వెళ్లి వచ్చేవారు. రైల్వేస్టేషన్ పునరాభివృద్ధి నేపథ్యంలో తుంగభద్ర ఎక్స్‌ప్రెస్‌ను ఇటీవల కాచిగూడకు మార్చారు. మల్కాజిగిరి నుంచి నేరుగా కాచిగూడ చేరుకునేందుకు ఉదయాన్నే ప్యాసింజర్, ఎంఎంటీఎస్ రైళ్లు లేకపోవడంతో వీరంతా సికింద్రాబాద్‌కు, అక్కడి నుంచి కాచిగూడకు 2బస్సులు మారాల్సి వస్తోంది. ఇలా 15 కిలోమీటర్ల ప్రయాణానికి బస్సుల్లో రూ.80, ఆటోలో అయితే రూ.200 ఖర్చవుతోంది. వాస్తవానికి కాచిగూడ నుంచి కర్నూల్‌కు ప్రయాణించడానికయ్యే ఖర్చు రూ.90 మాత్రమే అని ప్రయాణికులు వాపోతున్నారు. వీరే కాదు సుదూర ప్రాంతాల నుంచి వచ్చేవారివీ ఇవే ఇబ్బందులు. రాత్రి 8గంటలకు తుంగభద్ర ఎక్స్‌ప్రెస్ కాచిగూడకు చేరుకుంటే అక్కడ పార్కింగ్ స్థలం లేకపోవడంతో బొల్లారం స్టేషన్‌కుపంపి అక్కడి నుంచి ఉదయం రైలును ప్రారంభిస్తున్నారు. ఇందుకు బదులుగా చర్లపల్లిలో నైట్‌హాల్టింగ్ ఇవ్వడం ద్వారా సికింద్రాబాద్ స్టేషన్‌లోకి వెళ్లకుండా నేరుగా కాచిగూడకు పంపొచ్చు. ఎక్కువ సంఖ్యలో ఉప్పల్, ఎల్బీనగర్, ఈసీఐఎల్ ప్రాంతాలనుంచి ప్రయాణికులకు లబ్ధి చేకూరుతుంది. దీంతో మధ్యలో ఉండే స్టేషన్లలో ఇతర ప్రయాణికులు ఎక్కే అవకాశమూ ఉంది.

**మూడు రైళ్లకు ప్రధాన డిమాండ్**

కాచిగూడ స్టేషన్ నుంచి తెల్లవారుజామున, రాత్రివేళల్లో బయల్దేరే రైళ్లను అందుకోవడానికి ప్రయాస తప్పడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు. ఉదయం 5.45 గంటలకు బయల్దేరే వందేభారత్ ఎక్స్‌ప్రెస్, సాయంత్రం 7 గంటలకు ప్రారంభమయ్యే బెంగళూరు, తిరుపతి వెళ్లే వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ రైళ్లకు డిమాండ్ ఉంది. వీటికి అందుబాటులో ఉండేలా ఎంఎంటీఎస్ రైళ్లను నడపాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.

# 'తాళ'మేస్తారు.. తీస్తారు



హైదరాబాద్: అనుమతి లేని నిర్మాణాలు, అనధికార అంతస్తులే లక్ష్యంగా అవినీతి అధికారులు రెచ్చిపోతున్నారు. భవనాలను సీజ్ చేసే అధికారాన్ని దుర్వినియోగం చేస్తున్నారు. మామూళ్ల కోసం వాడుకుంటున్నారు. యజమానులు లంచం ఇవ్వగానే.. సదరు అధికారులు ఆయా భవనాల వైపు కన్నెత్తి చూడట్లేదు. ఏమీ తెలియనట్లు ఉండిపోతున్నారు.

**ఉన్నత న్యాయస్థానాల సూచనలతో..**

అనుమతి లేని భవనాలను నియంత్రించేందుకు ప్రభుత్వాలకు సుప్రీంకోర్టు, రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం కొన్ని సూచనలు చేశాయి. మొదటి దశలోనే అనుమతి లేని భవనాలను గుర్తించి, అక్కడికక్కడే.. భవనాన్ని లేదా నిర్మాణ ప్రాంగణానికి సీజ్ చేయాలని ఆదేశించాయి. ఆ మేరకు ఈ ఏడాది జూన్‌లో కమిషనర్ ఆర్వీ.కర్ణన్ బల్దియా అధికారులకు.. అక్రమ నిర్మాణాలకు తాళం వేసే ప్రక్రియను అమలు చేయడంపై మార్గదర్శకాలు ఇచ్చారు. జీహెచ్‌ఎంసీ చట్టం-1955లోని సెక్షన్ 461-ఏ కింద భవనాలను సీజ్ చేసే అధికారాన్ని సర్కిళ్ల ఉపకమిషనర్, జోనల్ కమిషనర్లకు కేటాయిస్తూ కమిషనర్ ఉత్తర్వు జారీ చేశారు.

**ఉల్లంఘిస్తే క్రిమినల్ కేసులే..**

సర్కిల్ కమిషనర్ సీజ్ చేసిన భవనాన్ని తిరిగి నిర్మించాలంటే జోనల్ కమిషనర్ అనుమతి ఉండాలని, జోనల్ కమిషనర్ సీజ్ చేసిన భవనాలను తెరిచేందుకు కమిషనర్ ఉత్తర్వు ఇవ్వాల్సి ఉంటుంది. ఈ నిబంధన ఉల్లంఘిస్తోన్న అధికారులను గుర్తించి చర్యలు తీసుకుంటామని నగర ముఖ్య ప్రణాళికాధికారి శ్రీనివాస్ తెలిపారు.

**ఆ రెండు జోన్లలోనే ఎక్కువ..**

ఇప్పటి వరకు సుమారు గ్రేటర్ పరిధిలో 300 భవనాలను జీహెచ్‌ఎంసీ సీజ్ చేసింది. శేరిలింగంపల్లి జోన్‌లోని మాదాపూర్, కొండాపూర్ ప్రాంతాలు, ఖైరతాబాద్ జోన్ జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాల మాటున రూ.కోట్లు వసూలు చేసి ప్రధాన రహదారులపైనా అక్రమ నిర్మాణాలను అనుమతిస్తున్నారు.

కొండాపూర్ రాఘవేంద్ర కాలనీలో జీ౦2కు అనుమతి తీసుకుని ఆరంతస్తులు కట్టగా.. అధికారులు సీజ్ చేశారు. నెల తిరగకుండానే పనులు మొదలయ్యాయి.రూ.20లక్షలు చేతులు మారాయనే విమర్శలున్నాయి. ః చందానగర్ గంగారంలో అనుమతి లేకుండా కడుతున్న భవనాన్ని అధికారులు సీజ్ చేశారు. ముడుపులు ముట్టడంతో.. పనులు తిరిగి మొదలయ్యాయి.

అన్నపూర్ణ స్టూడియో దిగువన ఇటీవలే జూబ్లీహిల్స్ సర్కిల్ అధికారులు అనుమతి లేకుండా కడుతున్న ఆరంతస్తుల నిర్మాణాన్ని సీజ్ చేశారు. పనులు మాత్రం ఆగలేదు.

అదే సర్కిల్ పరిధిలో అనుమతి లేకుండా కార్ల షోరూంనే ఏర్పాటు చేశారు. సీజ్ చేయడానికి వెళ్లిన అధికారులు.. ఆ పని చేయకుండానే వెనుదిరగడంపై మరిన్ని అనుమానాలు రేకెత్తుతున్నాయి.


# సమయం చూసుకోండి.. సరిచేసుకోండి

మెదక్ : గత ఏడాది పటాన్‌చెరు మండలం చిట్కుల్ గురుకుల పాఠశాలలో పదో తరగతి చదివిన ఓ విద్యార్థిని పుట్టిన తేదీ మార్కుల ధ్రువపత్రంలో తప్పుగా వచ్చింది. తరువాత మార్చుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.రెండు సంవత్సరాల క్రితం సంగారెడ్డి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివిన ఓ విద్యార్థి పేరులో అక్షరం తప్పు పడింది. సరి చేయించుకోకపోవడంతో ఇప్పుడు కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోంది.

ప్రతి విద్యార్థికి పదో తరగతి ధ్రువపత్రం కీలకం. ఇందులోని వివరాలే భవిష్యత్తులో అన్ని ధ్రువపత్రాల్లో నమోదు చేస్తారు. తల్లిదండ్రులు, పాఠశాలల సిబ్బంది చేసే కొన్ని పొరపాట్ల వల్ల దోషాలు దొర్లుతున్నాయి. సరిచేయకపోతే ఉద్యోగావకాశాలు, విదేశాల్లో ఉన్నత చదువులతో పాటు ఒక్కోసారి భవిష్యత్తుకు ఇబ్బంది అయ్యే ప్రమాదం ఉంటుంది. 2025-26 విద్యా సంవత్సరంలో పదో తరగతి విద్యార్థుల పేర్లు, వివరాల మార్పునకు విద్యాశాఖ సమయం ఇచ్చింది.

**ఆధార్ కార్డు సాయంతో..**

ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో పదో తరగతి పరీక్షలకు సంబంధించిన ప్రక్రియ ప్రారంభమైంది. యూడైస్ ఆధారంగా



విద్యార్థుల వివరాలను ప్రభుత్వ, ప్రైవేట్, గురుకుల, కస్తూర్బా, ఆదర్శ పాఠశాలల్లో నమోదు చేస్తున్నారు. ఏమైనా తేడా ఉంటే నవంబరు రెండో వారం వరకు గడువు ఇచ్చారు. విద్యార్థి, తల్లిదండ్రుల ఇంటి పేర్లలో అక్షరాలు.. పుట్టిన తేదీ, నెల, సంవత్సరం, ఇతర వివరాలను ఆధార్ కార్డు సహాయంతో సరి చేసుకోవచ్చు. కులం పేరు తప్పుగా ఉంటే తహసీల్దార్ జారీ చేసిన కుల ధ్రువీకరణ పత్రం జత చేయాల్సి ఉంటుంది. పదో తరగతి ధ్రువపత్రానికున్న ప్రాధాన్యత దృష్ట్యా తల్లిదండ్రులు సమయం కేటాయించి పిల్లల వివరాలు తనిఖీ చేసుకోవాలి. హెచ్‌ఎంలు సైతం పరిశీలించాలి.

**తప్పనిసరిగా వచ్చి పరిశీలించాలి**

– వెంకటేశ్వర్లు, జిల్లా విద్యాధికారి, సంగారెడ్డి

ఒకసారి సర్టిఫికెట్ వచ్చిన తరువాత మార్పులు చేయడం అంత సులభం కాదు. అందువల్ల ఇప్పుడే పాఠశాలకు వెళ్లి తల్లిదండ్రులు అన్ని వివరాలను సరిచూసుకోవాలి.

# నషా.. వీడితేనే బతుకుపై ఆశ

కరీంనగర్: దేశంలోని విద్యార్థులు, యువకుల బంగారు భవిష్యత్తును మాదకద్రవ్యాలు నాశనం చేస్తున్నాయి. ఈ మత్తు ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపడంతోపాటు సమాజంలో కుటుంబం, ఆత్మ గౌరవాలను దెబ్బతీస్తుంది. చిన్న వయసులోనే జీవితాలు అతలాకుతలం అవుతున్నాయి. అప్పట్లో ఎక్కడో కొంతవరకు రహస్యంగా జరిగే ఈ మాదకద్రవ్యాల వ్యవహారం కొన్ని విద్యాసంస్థల వరకు పాకింది. దీనిని దృష్టిలో ఉంచుకొని కేంద్ర ప్రభుత్వం 'నషా ముక్త్ భారత్ అభియాన్' అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది.

ఈ చైతన్య కార్యక్రమం అయిదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా దేశవ్యాప్తంగా మరింత విస్తృత ప్రచారం చేపట్టాలని కేంద్రం నిర్ణయం తీసుకుంది. జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈ నెలాఖరు వరకు ప్రచార, అవగాహన కార్యక్రమాలు చేపట్టనుంది. పలు శాఖలను సమన్వయం చేసుకొని ముందుకు వెళ్లడానికి అవసరమైన ప్రణాళికలు రచించింది. జిల్లాలో విజయవంతం చేయడానికి కలెక్టర్ పమేలా సత్పతి ప్రత్యేక చొరవ చూపుతూ పలుమార్లు సమీక్ష సమావేశాలు నిర్వహించారు. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పని చేసేలా దిశానిర్దేశం చేశారు.

**అన్ని శాఖల సమన్వయంతో..**

జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ, అనుబంధ బాలల పరిరక్షణ విభాగం, సఖి, చైల్డ్ లైన్-1098, పోషణ్ అభియాన్‌లతోపాటు మున్సిపల్, నెహ్రూ యువ కేంద్రం, గ్రామీణాభివృద్ధి, పోలీస్ శాఖలతోపాటు స్వచ్ఛంద సంస్థల సంయుక్త భాగస్వామ్యంతో ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా పాఠశాలలు, జూనియర్, డిగ్రీ, పీజీ, వైద్య, ఫార్మసీ తదితర కళాశాలల్లో 'నషా ముక్త్ భారత్'లో భాగంగా అవగాహన కల్పిస్తున్నారు. పలు విద్యాసంస్థల ప్రతినిధులతో ఇప్పటికే ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు. మత్తుకు బానిస కావడంతో వచ్చే నష్టాల గురించి అవగాహన కల్పిస్తున్నారు. మాదకద్రవ్యాలు స్వీకరించబోమని విద్యార్థులతో ప్రతిజ్ఞలు చేయించిన




అనంతరం మారథాన్‌లు నిర్వహిస్తున్నారు. గోడల మీద రాతలు, చిత్రాలతోపాటు గోడపత్రికలతో ప్రచారం నిర్వహిస్తున్నారు. చిత్రలేఖనం, డ్రాయింగ్, క్విజ్ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేస్తున్నారు.

**విస్తృత ప్రచారం...**

– సరస్వతి, జిల్లా సంక్షేమ అధికారి

నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో మాదకద్రవ్యాలతో కలిగే అనర్థాలపై విభిన్న కార్యక్రమాల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహిస్తాం. ఇప్పటికే అవసరమైన ప్రణాళికలు రచించాం. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పలు శాఖల సమన్వయంతో కార్యక్రమాలు విజయవంతమయ్యేలా సమష్టిగా కృషి చేస్తాం.

# పారి'శుద్ధ్యం' అబద్ధం

హైదరాబాద్ : గ్రేటర్‌లో పారిశుద్ధ్య నిర్వహణపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల అసహనం వ్యక్తం చేశారు. ఇంత అధ్వానమా.. అని బల్దియా కమిషనర్ ఆర్వీ.కర్ణన్‌పై ఆగ్రహం వ్యక్తం చేసిన మరుసటి రోజే ఖైరతాబాద్ జడ్సీ అనురాగ్ జయంతి అంతా పర్యవేక్షించారు. చెత్తకుప్పల శుభ్రతకు మొత్తం 500 వాహనాలను కేటాయించాల్సి ఉండగా కేవలం 273 వాహనాలను ఉపయోగిస్తోన్న రాంకీ సంస్థకు రూ.లక్ష జరిమానా విధించారు. ఉపకమిషనర్లు ఉదయం 6 కల్లా క్షేత్రస్థాయిలో తిరిగి పర్యవేక్షించాలి. ప్రస్తుతం ఆ నిబంధన చాలాచోట్ల అమలు కావట్లేదు. ఐఏఎస్‌లు జడ్సీలుగా ఉన్న జోన్లలోనూ పారిశుద్ధ్యం దారుణంగా ఉంది.

జీహెచ్ఎంసీలోని 18 వేల మంది పారిశుద్ధ్య కార్మికులు, వందలాది మంది అధికారులు, అస్కీ (అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా) నిపుణులు, రాంకీ యంత్రాంగం, స్వచ్ఛ ఆటోలు.. నిత్యం పని చేస్తున్నా.. రాజధానిలో చెత్త సమస్య తీరట్లేదు.

మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ నగరంలో పారిశుద్ధ్య విభాగంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది ఉంటారు. వాహనాల్లో తిరుగుతూ ఉల్లంఘనులను గుర్తించి అక్కడి కక్కడే జరిమానా వేస్తారు. ఇలాంటి విధానాన్ని ఇంతకు



ముందున్న కమిషనర్ ఇలంబర్తి కూడా అమల్లోకి తేవడంతో మార్చి నుంచి సెప్టెంబరు వరకు రూ.కోటి జరిమానా విధించారు.

చెత్త డబ్బాలను తొలగించింది.. 15 ఏళ్ల క్రితం
ఐదేళ్ల కిందట మళ్లీ ఏర్పాటు చేసినవి.. 1,200
అదనంగా ఏర్పాటు చేసినవి.. 1,300
డబ్బాలే లేని చెత్తకుప్పలు.. సుమారు 1,000
నగరంలో నిత్యం ఉత్పత్తి అయ్యే చెత్త.. 8,500 టన్నులు
ఇంటింటి నుంచి స్వచ్ఛ ఆటోలు సేకరించేది.. 4,000 టన్నులే. (మిగిలినది హోటళ్ల వ్యర్థాలు, కొమ్మలు)
సేకరణ ఆటోలు.. 2,500
ఇంటింటి నుంచి నెలకు వసూలు చేసేది.. రూ.100-150 (ఈమాత్రమైనా ఇవ్వకుండా రోడ్లపై పడేస్తున్నారు.)చెత్తకుప్పలు అధికంగా ఉన్న జోన్లు.. చార్మినార్, ఖైరతాబాద్, సికింద్రాబాద్

# బడి గోడ దాటని భగీరథ

సారంగాపూర్ : సారంగాపూర్ మండలంలో 5 ఉన్నత, 3 ప్రాథమికోన్నత, 25 ప్రాథమిక పాఠశాలల్లో మొత్తం 1,669 మంది విద్యార్థులు చదువుతున్నారు. సారంగాపూర్, రేచపల్లి ఉన్నత పాఠశాలల్లో దాతల సహకారంతో శుద్ధ జల యంత్రాలు ఏర్పాటు చేశారు. బీర్‌పూర్ మండలంలో 4 ఉన్నత, 3 ప్రాథమికోన్నత, 26 ప్రాథమిక పాఠశాలల్లో కలిపి 1,495 మంది విద్యార్థులున్నారు. మండలకేంద్రంతో పాటు తుంగూరు పాఠశాలల్లో మాత్రమే శుద్ధ జల పరికరాలున్నాయి. అది కూడా విద్యార్థుల సంఖ్యను అనుగుణంగా ప్లాంటు సామర్థ్యం లేక తాగునీటి అవసరాలు తీరడం లేదు.

జిల్లావ్యాప్తంగా సర్కారు బడుల్లో దాహార్తి నెలకొంది. అన్ని పాఠశాలలకు మిషన్ భగీరథ నీరు అందుతుందని రికార్డుల్లో ఉన్నా క్షేత్ర స్థాయిలో ఇందుకు భిన్నమైన పరిస్థితి. పైపులైన్ వేసినా పూర్తి స్థాయిలో పనులు చేయలేదు. మిషన్ భగీరథ, విద్యాశాఖల మధ్య సమన్వయం లేక శుద్ధ జలం అందని ద్రాక్షగానే మారింది. ఎక్కడైనా దాతల సహకారంతో ఏర్పాటు చేసినా ప్లాంట్ల సామర్థ్యం తక్కువగా ఉండటంతో అవసరాలకు సరిపోవడం లేదు.

**నిర్వహణ లేక ఏడాదికే మూలకు..**

పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించడానికి ప్రభుత్వం ఏటా నిధులు విడుదల చేస్తున్నా తాగునీటి కష్టాలు మాత్రం తీరడం లేదు. దీంతో పిల్లలు కలుషిత నీటిని తాగాల్సి వస్తోంది. జిల్లాలో 781 ప్రభుత్వ పాఠశాలల్లో కలిపి దాదాపు 60 వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. అన్ని పాఠశాలలకు మిషన్ భగీరథ నీటిని అందించాలని ఆదేశాలున్నా సరఫరా లేక బోరుబావి నీటితోనే సరిపెట్టుకోవాల్సి వస్తోంది. 2011లో ప్రభుత్వం పలు పాఠశాలలకు శుద్ధ జల పరికరాలు అందించింది. నిర్వహణ సరిగ్గా లేక ఏడాదికే పరికరాలు చెత్త కుప్ప పాలయ్యాయి.



**ముందు పైపులుంటే నీరందినట్లే(నా)!**

ప్రతి బడికి మిషన్ భగీరథ నీటిని సరఫరా చేయాలని ఆదేశాలున్నా ఎక్కడా అందడం లేదు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పాఠశాల ముందు నుంచి పైపులైన్ వెళ్తే సరఫరా చేస్తున్నట్లు కాగితాల్లో చూపుతున్నట్లు తెలుస్తోంది. చాలా చోట్ల విద్యార్థులు ఇంటి నుంచి సీసాల్లో తెచ్చుకుంటున్నారు. ఉదయం 9 గంటలకు లీటరు సీసాలో నీటిని తీసుకొని బడికి వచ్చే విద్యార్థి సాయంత్రం వరకు వాటినే సరిపెట్టుకుంటున్నాడు. మధ్యాహ్న భోజనం తిన్నాక, ఆటలు ఆడిన తర్వాత సమీపంలోని బోరు లేదా ట్యాంకు నీటిని వాడాల్సి వస్తోంది. ప్రస్తుతం పాఠశాలలకు దసరా సెలవులున్నందున ఉన్నతాధికారులు చొరవ చూపి పైపులైన్ అందుబాటులో ఉన్న పాఠశాలలకు నీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

# భగాయత్.. బాధలు తీరేదెన్నడో?



ఉప్పల్ : మూసీ ఒడ్డున 400 ఎకరాల్లో హెచ్ఎండీఏ అభివృద్ధి చేసిన ఉప్పల్ భగాయత్ లేఅవుట్‌లో సమస్యలు నివాసితులను పీడిస్తున్నాయి. హెచ్ఎండీఏ వేలంలో గజం స్థలాన్ని రూ.లక్షకుపైగా విక్రయించింది. జీహెచ్ఎంసీకి లేఅవుట్ అప్పగింత ప్రక్రియ ఏళ్ల తరబడి కొనసాగుతుంది. ఇక్కడ అభివృద్ధిని మాత్రం జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ పట్టించుకోవడం లేదు. నిధులివ్వకుండానే హెచ్ఎండీఏ తప్పుకొంది. ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు, ఆస్తిపన్నును జీహెచ్ఎంసీ వసూలుచేస్తోంది. నిధుల్లేవంటూ జీహెచ్ఎంసీ పనులు చేపట్టడంలేదు. అందమైన లేఅవుట్ నేడు సమస్యలతో నిండిపోయింది. లేఅవుట్ ఫేస్-1,2లలో 3వేలకుపైగా కుటుంబాలు ఉంటున్నాయి. కనీస సౌకర్యాలు లేక నివాసితులు ఇబ్బందిపడుతున్నారు. ఫేస్-2లో మంచి నీటి సౌకర్యమూ లేదు.

గోదారులు.. వర్షపు నీటిని బయటకు తరలించే వ్యవస్థ ఏర్పాటుచేయలేదు. ఫేస్-2లో చిన్న వర్షానికే రహదారులన్నీ గోదారులుగా మారుతున్నాయి. ముఖ్యంగా డీమార్ట్, ఉప్పల్ ఐడీఏ, రామంతాపూర్ మార్గాలలో సమస్య తీవ్రంగా ఉంది. జలమండలి రూ.22 కోట్లతో చేపట్టిన భూగర్భ డ్రైనేజీ పనులు అస్తవ్యస్తంగానే ఉన్నాయి. ఉన్న రోడ్లు తవ్వేసి వదిలేశారు.

ఆయా విభాగాల అధికారులకు సమస్యలు విన్నవించిన పట్టించుకోవడం లేదని భగాయత్ లేఅవుట్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మేకల మధుసూదన్‌రెడ్డి వాపోయారు.

**ఎస్టీపీ ఏదీ?..** లేఅవుట్‌లో డ్రైనేజీని శుద్ధి చేసి మూసీలోకి వదిలేలా మురుగు నీటి శుద్ధి కేంద్రం(ఎస్టీపీ) నిర్మించలేదు. నేరుగా మూసీలోకే మళ్లించి హెచ్ఎండీఏ చేతులు దులుపుకొంది.

పడకేసిన పారిశుద్ధ్యం.. పారిశుద్ధ్య పనులను జీహెచ్ఎంసీ పర్యవేక్షిస్తోంది. ఇటీవలే 22 మందితో పనులు చేపట్టింది. ఫేస్-1లోనే అరకొరగా సాగుతున్నాయి. ఫేస్-2లో ఎక్కడి చెత్తకుప్పలు అక్కడే ఉంటున్నాయి. దోమల సమస్య తీవ్రంగా ఉంది.

# తప్పు చేయకున్నా.. తప్పని తిప్పలు!..
# సైబర్ ఉచ్చులో ఖాతాదారులు




హైదరాబాద్ : బంజారాహిల్స్‌కు చెందిన వ్యాపారి తన మిత్రుడికి రూ.లక్ష చేబదులుగా ఇచ్చాడు. 2 నెలలకు ఆయన వ్యాపారి బ్యాంకు ఖాతాకు ఆసొమ్ము బదిలీ చేశాడు. వారం తరువాత ఇద్దరి బ్యాంకు ఖాతాలు నిలిచిపోయాయి. ఆరాతీస్తే అనుమానాస్పద లావాదేవీలు జరిగినట్టు బ్యాంకు అధికారులు చెప్పారు. కర్ణాటకలో బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్టు తెలుసుకున్నారు.

నగర శివారు కొంపల్లి ప్రాంతంలో ఒకరు చిన్నతరహా పరిశ్రమతో 20-30 మందికి ఉపాధి కల్పిస్తున్నారు. ఇటీవల రూ.80 లక్షల బ్యాంకు రుణం మంజూరు చేయించుకున్నారు. మరుసటిరోజే లావాదేవీలు నిలిచిపోయాయి. గతంలో ఆయన యూపీఐ ఖాతాలో ఒక యువకుడు రూ.90 వేలు జమచేసి నగదు తీసుకున్నాడు. ఆయన సైబర్ నేరస్థుల సొమ్మును మార్పిడి చేసే ఏజెంట్ కావడంతో కేరళ పోలీసుల ఫిర్యాదుతో ఖాతా స్తంభింపజేసినట్టు బ్యాంకర్లు వర్తమానం పంపారు.వీరు ఎలాంటి నేరచరిత్ర లేకున్నా పోలీసు రికార్డుల్లోకి చేరారు. బాధితులు తమ కష్టార్జితాన్ని చెల్లించి బయటపడ్డారు. ఏతప్పు చేయకున్నా నేరస్థులుగా మారామనే మనోవేదన అనుభవించారు. ఇవిఉదాహరణలే. సైబర్ మాయగాళ్లు సామాన్యుల నుంచి బడా వ్యాపారుల వరకు వారికి తెలియకుండానే బ్యాంకు ఖాతాలను వాడుకుంటున్నారు.

సైబర్ నేరస్థులు కాజేసిన సొమ్ము తెలిసో, తెలియకో ఖాతాల్లోకి వచ్చినట్టు గుర్తిస్తే తప్పనిసరిగా ఫ్రీజ్ చేస్తారని పోలీసులు తెలిపారు. అనుమానాస్పద లావాదేవీలు జరిగినట్టు గుర్తించగానే సంబంధిత బ్యాంకు, సమీప పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే కొంత వెసులుబాటు ఉంటుందని చెప్పారు.

**పసిగట్టలేక.. విలవిల**

అకస్మాత్తుగా కొందరి బ్యాంకు ఖాతాల్లో నగదు జమవుతాయి. ఖాతాదారులు గుర్తించేలోపు మాయమవుతాయి. ఇందుకు సాంకేతిక కారణమైతే ఏసమస్యా ఉండదు. సైబర్ నేరస్థులతో సంబంధాలున్న వ్యక్తులు, సంస్థల నుంచి నగదు చేరినప్పుడు ఇబ్బందులు తప్పవు. తెలియక జరిగినా ప్రతిఫలం చవిచూడాల్సిందే. సైబర్ మోసగాళ్లు బాధితులనుంచి కాజేసిన సొమ్మును జమ చేసేందుకు చిరువ్యాపారులు,కూలీలు, నిరుద్యోగుల బ్యాంకు ఖాతాలను వాడుకుంటారు. బాధితులు ఫిర్యాదు చేసినప్పుడు పోలీసుల సిఫార్సుతో బ్యాంకు అధికారులు ఆ నగదు లావాదేవీలు జరిగిన అన్ని ఖాతాలను ఫ్రీజ్ చేస్తారు. దీని నుంచి బయటపడేందుకు నానాతంటాలు పడుతున్నారు. చివరికి కొందరు బాధితులు నష్టపోయిన సొమ్మును తిరిగి చెల్లించి బ్యాంకు ఖాతాలను పునరుద్ధరించుకుంటున్నారు. ఇటీవల నగరానికి చెందిన ఒక వ్యాపారి రూ.2 లక్షలు బాధితుడి ఖాతాకు జమ చేశాడు.

# చీదరించొద్దు.. ఆదరించండి




కొడంగల్ : కొడంగల్ మండలం రావులపల్లికి చెందిన అఖిలను ఒంటి గంటకు మాతా, శిశు ఆసపత్రికి తీసుకొస్తే.. తెల్లవారు జాము వరకు వైద్యురాలు వచ్చి చూడకపోవడంతో నర్సులే వైద్యం చేశారు. పరిస్థితి విషమించి గర్భంలో శిశువుతోసహా తల్లి మృతిచెందింది.యాలాల మండలం దేవనూరుకు చెందిన గర్భిణికి పురిటి నొప్పులు రావడడంతో ఆస్పత్రికి వచ్చారు. సాధారణ ప్రసవం అవుతుందని వైద్యులు, సిబ్బంది రోజంతా కాలక్షేపం చేయించారు. గర్భంలో శిశువు మృతిచెందాక శస్త్రచికిత్స చేశారు. వైద్యులు, సిబ్బందితో బాధితులు గొడవపడ్డారు. మాతాశిశు సంరక్షణ ఆస్పత్రికి నిర్లక్ష్యపు జబ్బు పట్టుకుంది. రోగులతో వైద్యులు, సిబ్బంది వ్యవహార శైలిపై పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైద్యానికి వస్తే సిబ్బంది ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని వాపోతున్నారు. గర్భిణులను ప్రసూతి వైద్యులు పరీక్షించకుండా కొన్ని సందర్భాల్లో స్టాఫ్‌నర్సులు, ఇతర నర్సులపై వదిలేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. దీంతో ఆస్పత్రిలో తరచూ గొడవలు, మాతాశిశు మరణాలు సంభవిస్తున్నాయని రోగులు అంటున్నారు.

**నిత్యం వందల సంఖ్యలో..:** తాండూరు- హైదరాబాద్ మార్గంలోని మాతాశిశు సంరక్షణ ఆస్పత్రిలో వికారాబాద్, కొడంగల్, తాండూరు, పరిగి, కర్ణాటక ప్రాంతం నుంచి గర్భిణులు, చిన్నారులు వైద్యసేవల కోసం రోజూ 450- 500 మంది వరకు వస్తుంటారు. వారిలో 30-50 మంది అడ్మిట్ అవుతుంటారు. ఆస్పత్రిలో ఒకరు రెగ్యులర్ ప్రసూతి వైద్యురాలుండగా.. మిగతా 8 మంది ఒప్పంద పద్ధతిపై పనిచేస్తున్నారు. చిన్నారుల వైద్యులు, మత్తు వైద్యులున్నారు. రోజూ 15- 20 వరకు సాధారణ ప్రసవాలు, 8-10 సిజేరియన్ కేసులు నమోదవుతున్నాయి.

**పరుష పదాలతో దూషిస్తూ..**

రోగులతో వైద్యులు, సిబ్బంది అమర్యాదగా ఉంటారని ఆరోపణలున్నాయి. ప్రసూతి గదిలో గర్భిణులతో పరుషంగా మాట్లాడతారని సంబంధీకులు చెబుతున్నారు. రోగుల వెంట వచ్చే వారిపైనా సిబ్బంది దురుసుగా ప్రవర్తిస్తారంటున్నారు. మెరుగైన వైద్యం అందిస్తున్నామని.. రోజూ సాధారణ, శస్త్ర చికిత్సలు చేస్తున్నామని డిప్యూటీ సూపరింటెండెంట్ డా.శరత్ తెలిపారు.

**వైద్యురాలి సస్పెన్షన్**

ప్రసూతి వైద్యురాలు మంజులను సస్పెండ్ చేసినట్లు మాతాశిశు సంరక్షణ ఆస్పత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ శరత్, ఆర్ఎంఓ అనిల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. కొడంగల్ మండలం రావులపల్లికి చెందిన అఖిల ప్రసవ వేదనతో ఆదివారం ఆస్పత్రిలో మృతిచెందడంతో బాధిత కుటుంబీకులు, బంధువులు ఆందోళన నిర్వహించారు. వైద్య విధాన పరిషత్ జాయింట్ డైరెక్టర్ రాజేశం, ప్రసూతి విభాగం అధికారిణి డా.సుమిత్ర ఆస్పత్రిలో విచారించారు. జరిగిన సంఘటనపై కిందిస్థాయి సిబ్బంది నుంచి వివరాలు ఆరా తీశారు. వైద్యురాలి నిర్లక్ష్యం ఉందని తేల్చిన అధికారులు ఆమెను సస్పెండ్ చేసినట్లు తెలిపారు.

# పెద్దలే గద్దలు!

వికారాబాద్ :మర్పల్లి మండలం పట్లూర్ శివారులో కాందిశీకులకు చెందిన 400 ఎకరాల భూములున్నాయి. దాదాపు 100 మందికిపైగా రైతులు సాగు చేసుకుంటున్నారు. ఆ భూములపై కొందరు నేతల కన్ను పడింది. ఉన్నత స్థాయిలో ఆదేశాలు రావడంతో అనుకూలంగా నివేదిక ఇవ్వాలని ఆర్ఐపై ఒత్తిడి తేగా.. సెలవుపై వెళ్లినట్లు సమాచారం.మర్పల్లి మండలం గణాపూర్, దామస్తాపూర్‌లో డబుల్ రిజిస్ట్రేషన్లు చేసి భూములు స్వాధీన పర్చుకునే ప్రక్రియ కొనసాగుతోంది. ఇటీవల మర్పల్లి మండలంలోని పట్లూర్‌లో ఓ నాయకుడి ఒత్తిడితో నిబంధనలకు విరుద్ధంగా ఎకరా సీలింగ్ భూమిని రిజిస్ట్రేషన్ చేసిన విషయమై దుమారం చెలరేగుతోంది.

పూడూరు మండలం రాకంచర్లలో ఓ నాయకుడు ఎకరా రూ.2 కోట్లు పలికే ఓ వృద్ధురాలి భూమిని హైదరాబాద్‌కు చెందిన వారికి రిజిస్ట్రేషన్ చేయించాడు. దీంతో ఆమె కుమారుడు గ్రామస్థులతో కలిసి ఠాణాలో ఫిర్యాదు చేశారు.జిల్లాలో భూ మాఫియా చెలరేగుతోంది. ఖాళీ స్థలాల కబ్జా, నకిలీ పత్రాలు సృష్టించి ఆస్తులను సొంతం చేసుకోవడం, అడ్డొచ్చిన వారిని బెదిరించడం, దాడులకు పాల్పడటం వంటి ఘటనలు తరచూ చోటుచేసుకుంటున్నాయి. కుమార్తె పెళ్లికనో, అత్యవసర పనులకు పనికి వస్తాయనో చాలామంది ప్లాట్లు కొంటున్నారు. అవసరానికి అమ్ముకోవాలనుకుంటే ఏదో ఒక కొర్రీ పెట్టి సమస్య సృష్టిస్తున్నారు. ఈ వ్యవహారాల్లో నాయకుల హస్తం ఉండటం



అక్రమార్కులకు కలిసి వస్తోంది.

**కబ్జాలు చేసి.. రూ.కోట్లు గడించి..**

జిల్లాకు చెందిన ఓ నాయకుడు అనతి కాలంలోనే భూ మాఫియాతో చేతులు కలిపి రూ.కోట్లు గడించాడు. నకిలీ పత్రాలతో స్థలాలను ఆక్రమించి సంపాదించాడు. మరికొందరు ముఠాలను పోషిస్తూ పని కానిచ్చేస్తున్నారు. ఏవైనా వివాదాస్పద భూములుంటే చాలు ముఠాలు రంగంలోకి దిగుతున్నాయి. మందీమార్బలంతో వివాదాస్పద స్థలాన్ని ఆక్రమించుకొని సెటిల్‌మెంట్లకు దిగుతున్నారు.

**శివారు కాలనీలపై దృష్టి..**వికారాబాద్, తాండూరు పట్టణ శివారు ప్రాంతాల్లోని భూముల ధరలు పెరగడంతో కబ్జాదారుల కన్ను వాటిపై పడింది. తప్పుడు పత్రాలు సృష్టించి దొంగ రిజిస్ట్రేషన్లు చేయించుకొని కబ్జాలకు పాల్పడుతున్నారు. స్థానిక ముఠాలు భూ వివాదాలను సృష్టించి బెదిరింపులకు పాల్పడుతున్నాయి.

# అరకొర బస్సులు.. దర్శనానికి తిప్పలు

ధర్మపురి : హైదరాబాద్ నుంచి ధర్మపురి దేవస్థానంలో స్వామివారిని దర్శించుకునేందుకు అయిదుగురు సభ్యులున్న ఓ కుటుంబం రాత్రి 10 గంటలకు జగిత్యాల బస్‌స్టాండ్‌కు చేరుకున్నారు. ఈ సమయంలో బస్సు లేక పిల్లాపాపలతో అక్కడే దోమలతో సావాసం చేస్తూ నిద్రించి మరునాడు 6 గంటలకు బస్సులో ధర్మపురికి చేరారు. ధర్మపురి నుంచి రాత్రి 10 గంటలకు కరీంనగర్‌కు వెళ్లాలనుకునే వరంగల్‌కి చెందిన నలుగురు వృద్ధులు బస్సు లేక ధర్మపురి ఆర్టీసీ బస్‌స్టాండులోని బెంచీలపై నిద్రించారు. మరునాడు ఉదయం 7 గంటలకు వయా రాయపట్నం మీదుగా కరీంనగర్‌కు వెళ్లారు.

జగిత్యాల ఆర్టీసీ డిపోలో సగానికిపైగా ఆదాయ వనరులున్న ధర్మపురి రూట్‌పై ఆర్టీసీ అధికారులు దశాబ్దాలుగా నిర్లక్ష్యం చేస్తున్నారు. నిత్యం జగిత్యాల డిపోనకు చెందినవి నాలుగు జగిత్యాల-ధర్మపురి బస్సులు 7 ట్రిప్పులు, మరో రెండు లక్షెట్టిపేట, ధర్మపురి-దొంతాపూర్ ఉదయం నుంచి సాయంత్రం వరకు నాలుగు ట్రిప్పులు మాత్రమే నడిపిస్తున్నారు. ఈ రూటులో ప్రతిరోజు కనీసం పది వేల మంది భక్తులతోపాటు జనం ప్రయాణం చేస్తుంటారు. సరిపోయినన్ని బస్సులు అందుబాటులో లేక భక్తులు అవస్థలు పడుతున్నారు.

**నైట్‌హాల్టుపై..**

జగిత్యాల నుంచి ధర్మపురికి రాత్రి 10 గంటల తర్వాత నైట్‌హాల్టు బస్సు ఏర్పాటు చేయాలని కోరుతున్నా డిపో అధికారులు శ్రద్ధ పెట్టడం లేదు. రాత్రి 7.20 గంటలు దాటిందంటే జగిత్యాల నుంచి ధర్మపురికి ఆర్డినరీ బస్సు లేదు. దీంతో దూర ప్రాంత భక్తులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. రూ.80 టికెట్ పెట్టుకుని రాత్రి 11 గంటలకు వచ్చే రాజధాని బస్సులో నిరుపేద భక్తులు రాలేకపోతున్నారు. కనీసం



రాత్రి 10 గంటలకు జగిత్యాల నుంచి ధర్మపురికి బస్సు ఏర్పాటు చేయాలని, ఇదే నైట్‌హాల్టు బస్సు ఉదయం 5 గంటలకు వేములవాడకు వెళ్లేలా చూడాలని భక్తులు కోరుతున్నారు. వయా రాయపట్నం కరీంనగర్‌కి చేరుకునేలా షటిల్ బస్సును ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ధర్మపురి-జగిత్యాలకి 29 కి.మీలు మాత్రమే. బస్సులో 60-70 మంది ప్రయాణించాల్సి ఉండగా 100 నుంచి 120 మంది ప్రయాణిస్తున్నారు. దీంతో ప్రతీ స్టేజీకి ఆగడం, వెళ్లడం వెరసి ధర్మపురి నుంచి జగిత్యాలకు గంటపావు సమయం తీసుకుంటోంది.

**పుణ్యక్షేత్రాలకు అనుసంధానమేదీ**

గతంలో ధర్మపురి నుంచి యాదగిరిగుట్ట, వేములవాడ, కొండగట్టు, వరంగల్‌కు బస్సులు నడిపేవారు. ఇవన్నీ రద్దు చేయడంతో దూర ప్రాంత భక్తులు అసౌకర్యానికి గురవుతున్నారు.



## వెస్ట్రన్ సిడ్నీ యూనివర్సిటీ ప్రతినిధులతో మంత్రి లోకేశ్ భేటీ

ఏపీ మంత్రి నారా లోకేశ్ ఆస్ట్రేలియా పర్యటన కొనసాగుతోంది. పర్యటనలో భాగంగా వెస్టర్న్ సిడ్నీ యూనివర్సిటీని మంత్రి సందర్శించారు. యూనివర్సిటీ సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లు, అగ్రికల్చరల్ టెక్నాలజీ పరిశోధకులతో ఆయన భేటీ అయ్యారు. ఏపీలో వ్యవసాయ ఆధునీకరణకు, ప్రెసిషన్ ఫార్మింగ్‌లో నైపుణ్యాలను ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంతో కలిసి పంచుకోవాలని లోకేశ్ కోరారు. రైతులు, అగ్రి-ప్రొఫెషనల్స్‌కు స్మార్ట్ ఫార్మింగ్ టెక్నిక్‌లు, అగ్రి-టెక్ ఇన్నోవేషన్లలో శిక్షణ ఇచ్చే సంయుక్త కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఏపీ విశ్వవిద్యాలయాలతో స్థిరమైన నీటి నిర్వహణ తదితర ప్రాజెక్టులపై సహకారం అందించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. స్మార్ట్ నీటిపారుదల వ్యవస్థలు, ఏఐ ఆధారిత వ్యవసాయ పరిష్కారాలను అభివృద్ధి చేసే ఇన్నోవేషన్ హబ్‌ల ఏర్పాటుకు సహకారం అందించాలని లోకేశ్ కోరారు. మరోవైపు ఆస్ట్రేలియాకు చెందిన సముద్ర ఉత్పత్తుల పరిశ్రమ ప్రతినిధులతోనూ ఆయన సమావేశమయ్యారు. ఏపీ-ఆస్ట్రేలియా మధ్య ఆక్వా ఎగుమతుల అంశంపై చర్చించారు. ఈ రంగం అభివృద్ధికి సహకారం అందించాలని మంత్రి కోరారు.

## భీమవరం డీఎస్పీ వ్యవహార శైలిపై పవన్ సీరియస్



అమరావతి: పశ్చిమగోదావరి జిల్లా భీమవరం డీఎస్పీ జయసూర్య వ్యవహారాలపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. భీమవరం పరిధిలో జూద శిబిరాలను ప్రోత్సహిస్తున్నారని, సివిల్ వివాదాల్లోనూ జోక్యం చేసుకుంటున్నారని డీఎస్పీపై ఆరోపణలు ఉన్నాయి. కూటమి నేతల నుంచి ఫిర్యాదులు అందిన నేపథ్యంలో ఆ జిల్లా ఎస్పీతో పవన్ మాట్లాడారు. జయసూర్య వ్యవహార శైలిపై నివేదిక పంపించాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. భీమవరం డీఎస్పీపై వచ్చిన ఆరోపణలను హోంమంత్రి, డీజీపీకి తెలియజేయాలని తన కార్యాలయ అధికారులకు పవన్ సూచించారు.

## మహిళా సాధికారత, రక్షణకు సీఎం ప్రాధాన్యం: మంత్రి అనిత



అమరావతి, అక్టోబర్ 21: మహిళా సాధికారత, రక్షణ కోసం సీఎం చంద్రబాబు నాయుడు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని రాష్ట్ర హోమ్ శాఖ మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. అందులో భాగంగా శక్తి యాప్‌ను తీసుకు వచ్చామన్నారు. అక్టోబర్ 21వ తేదీ మంగళవారం పోలీసుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా పోలీస్ అమర వీరులకు హోం మంత్రి అనిత ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. డ్రగ్స్, గంజాయి అక్రమ రవాణాను నిరోధించేందుకు ఏర్పాటు చేసిన ఈగల్ టీమ్ సమర్థవంతంగా పని చేస్తుందన్నారు. ఆపరేషన్ సేఫ్ పేరిట విద్యార్థుల్లో అవగాహన పెంచేందుకు చర్యలు చేపట్టామన్నారు. సైబర్ స్టేషన్ల ఏర్పాటు.. సీసీ కెమెరాలు, డ్రోన్లు సైతం ఏర్పాటు చేశామని వివరించారు. రాష్ట్ర ప్రజల భద్రత కోసం సీఎం చంద్రబాబు నాయుడు తీసుకుంటున్న చర్యలపై హోమ్ మంత్రి అనిత ప్రశంసలు కురిపించారు. అంతకు ముందు పోలీస్ అమరవీరులకు సీఎం చంద్రబాబు నాయుడు ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఏపీ డీజీపీ హరీశ్ కుమార్ గుప్తాతోపాటు పలువురు పోలీస్ ఉన్నతాధికారులు హాజరయ్యారు.



## డీకేతో కిరణ్ మజుందార్ షా భేటీ

బెంగళూరు: భారత సిలికాన్ వ్యాలీగా అభివర్ణించే బెంగళూరులో రోడ్ల దుస్థితిపై పారిశ్రామికవేత్తల విమర్శలు, నేతల వ్యంగ్యాస్త్రాలతో ఇటీవల కర్ణాటకలో రాజకీయ దుమారం రేగిన సంగతి తెలిసిందే. ఈ వివాదం కొనసాగుతోన్న వేళ కీలక పరిణామం చోటుచేసుకుంది. కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తో బయోకాన్ లిమిటెడ్ వ్యవస్థాపకురాలు కిరణ్ మజుందార్ షా మంగళవారం భేటీ అయ్యారు. ఈరోజు ఉదయం డిప్యూటీ సీఎం నివాసానికి వచ్చిన కిరణ్ మజుందార్ షా.. తన మేనల్లుడి వివాహానికి డీకేను ఆహ్వానించారు. అంతకుముందు ముఖ్యమంత్రి సిద్ధరామయ్య నివాసానికి వెళ్లి ఆయనను కూడా పెళ్లికి ఆహ్వానించినట్లు కాంగ్రెస్ వర్గాలు వెల్లడించాయి. శివకుమార్‌తో భేటీ అనంతరం కిరణ్ మజుందార్ షా మీడియాతో మాట్లాకుండానే అక్కడి నుంచి వెళ్లిపోయారు. కాసేపటికి ఈ సమావేశం గురించి డీకే తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. బెంగళూరు పురోగతి, సృజనాత్మక, రాష్ట్ర అభివృద్ధి మార్గాలపై ఆమెతో చర్చించినట్లు డీకే వెల్లడించారు.

గత కొంతకాలంగా బెంగళూరు రోడ్ల పరిస్థితిపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో బయోకాన్ పార్క్‌కు వచ్చిన ఓ విదేశీ విజిటర్.. నగరంలోని రోడ్లు, చెత్తపై చేసిన వ్యాఖ్యలతో తాను ఇబ్బందిపడ్డానని కిరణ్ మజుందార్ షా ఓ పోస్టులో వెల్లడించారు. ఇది కాస్తా వైరల్‌గా మారింది. దీనిపై కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ వ్యంగ్యంగా బదులిచ్చారు. ఆమె రోడ్లను అభివృద్ధి చేయాలనుకుంటే చేయొచ్చన్నారు. అందుకోసం నిధులు కూడా ఇస్తామన్నారు. వ్యక్తిగత అజెండాతోనే ఆమె ఈ విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. దీంతో ఆమెకు పలువురు పారిశ్రామికవేత్తలు మద్దతుగా నిలిచారు. సమస్యకు పరిష్కారం వెతకడం మాని రాజకీయాలు చేస్తున్నారంటూ హర్ష్ గొయెంకా అసహనం వ్యక్తంచేశారు. బెంగళూరు కోసం గళమెత్తే వారిపై దాడులు చేసే ట్రెండ్ సరికాదని, దాన్ని మానుకోవాలని ఇన్ఫోసిస్ మాజీ సీఎఫ్ఓ మోహన్‌దాస్ పాయ్ ఓ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో అన్నారు.

## త్వరలో పోలీస్ శాఖలో రిక్రూట్‌మెంట్: మంత్రి అచ్చెన్న



శ్రీకాకుళం, అక్టోబర్ 21: పోలీస్ అమరవీరుల దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి అచ్చెన్నాయుడు పాల్గొన్నారు. అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. చాలా సమస్యలు ఉన్నాయని.. అయినా ఉద్యోగులకు అండగా ఉంటున్నామన్నారు. అందరు ఉద్యోగులకు డీఏ ఇచ్చామని తెలిపారు. పోలీస్ రిక్రూటమెంట్ జరగాల్సిన అవసరం ఉందని చెప్పారు. గత ఐదు సంవత్సరాల పాలనలో రిక్రూట్‌మెంట్ చేయలేదన్నారు. 6 వేల ఉద్యోగాలను కూటమి ప్రభుత్వం రిక్రూట్ చేసిందని.. త్వరలో పోస్టింగ్ ఇస్తామని వెల్లడించారు. అందరం కలిసి శాంతి భద్రతలను కాపాడుదామని పిలుపునిచ్చారు. పోలీస్ స్టేషన్‌లు, క్వార్టర్లు సరిగాలేవని.. పోలీస్ స్టేషన్‌ల అభివృద్ధిపై దృష్టిపెడతామని స్పష్టం చేశారు. పోలీసులు, వారి కుటుంబాలకు ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. అమరవీరుల త్యాగాలు మరువలేమని.. వారికి నివాళులు అర్పిస్తున్నామని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. మరోవైపు ఏలూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్లో పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రేంజ్ డీఐజీ అశోక్ కుమార్, జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి, జిల్లా ఎస్పీ శివ ప్రతాప్ కిషోర్ పాల్గొన్నారు. పోలీస్ స్థూపం వద్ద పోలీస్ అమరవీరులకు పోలీస్ అధికారులు నివాళలర్పించారు.

ఈ సందర్భంగా ఏలూరు రేంజ్ డీఐజీ అశోక్ కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో శాంతి భద్రతల విషయంలో పోలీస్ శాఖ పాత్ర కీలకమన్నారు. దేశంలో 191 మంది పోలీసులు దేశం కోసం ప్రాణత్యాగం చేశారని వెల్లడించారు. పోలీస్ అమరవీరుల కుటుంబాలకు పోలీస్ శాఖ ఎప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ నుంచి ఈ సంవత్సరం ఐదుగురు పోలీసులు అమరులయ్యారని ఏలూరు రేంజ్ డీఐజీ అశోక్ కుమార్ వెల్లడించారు.



## గతేడాది కంటే ఈసారి భారీగా పెరిగిన ఢిల్లీ కాలుష్యం

న్యూఢిల్లీ : దేశ రాజధాని ఢిల్లీని వాయు కాలుష్యం కమ్మేసింది. ఢిల్లీ గాలిలో వాయు కాలుష్యం మరింత పెరిగింది. దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని రాజధానిలో ప్రజలు టపాకాయలతో హోరెత్తించారు. దీపావళి పండుగను ఢిల్లీ వాసులు ఘనంగా జరుపుకున్నారు. అయితే పండల సెలబ్రేషన్స్ అనంతరం ఢిల్లీలో వాయు కాలుష్యం ప్రమాదకర స్థాయికి చేరుకుంది. ఈ క్రమంలో సెంటర్ కమిషన్ ఫర్ ఎయిర్ క్వాలిటీ మేనేజ్మెంట్ గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ 2 ను అమలు చేస్తోంది.

ఢిల్లీలో పలు ప్రాంతాల్లో వాయు కాలుష్యం అధికంగా నమోదైంది. ఈరోజు (మంగళవారం) ఉదయం 7 గంటలకు ఢిల్లీలో వాయి నాణ్యత 471 పాయింట్లుగా నమోదు అయ్యింది. దీనిని వెరీ పూర్ కేటగిరీకి గాలి నాణ్యత సూచీ చేరింది. ఇది చాలా ప్రమాదకరమని కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి నిపుణులు చెబుతున్నారు. ఈ సారి కాలుష్యాన్ని తగ్గించేందుకు సుప్రీం కోర్టు గ్రీన్ క్రాకర్స్‌కు మాత్రమే అనుమతి ఇచ్చినప్పటికీ పరిస్థితుల్లో ఏమాత్రం మార్పు కనిపించలేదు. పైగా గత ఏడాది దీపావళి మరుసటి రోజు ఉదయం నమోదు అయిన 296 ఐక్యూ ఐతో పోలిస్తే ఈసారి కాలుష్యం మరింత తీవ్రంగా ఉండటం ఆందోళన కలిగిస్తోంది. నిన్న సాయంత్రం 4 గంటలకే ఢిల్లీ ఏక్యూ ఐ 400గా వెరీ పూర్ కేటగిరీలో నమోదు అయినట్లు సిస్టమ్ ఆఫ్ ఎయిర్ క్వాలిటీ అండ్ వెదర్ ఫోరకాస్టింగ్ అండ్ రీసర్చ్ వెల్లడించింది. ఇక టపాసుల మోతతో రాత్రికి రాత్రే గాలి నాణ్యత మరింత క్షీణించింది. ఇలాంటి కలుషితమైన గాలిని ఎక్కువ సేపు పీల్చడం వల్ల తీవ్రమైన శ్వాసకోస వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని సీపీసీపీ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**పలు ప్రాంతాల్లో నమోదైన వాయు కాలుష్య వివరాలు..** మేజర్ ధ్యాన్చంద్ నేషనల్ స్టేడియం పరిసర ప్రాంతాల్లో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 371 పాయింట్లుగా నమోదు. సోనియా విహారలో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 371 పాయింట్లుగా నమోదు. ఆర్కే పురంలో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 368 పాయింట్లుగా నమోదు. చాందిని చౌక్‌లో 360 పాయింట్లుగా ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ నమోదు.



## జగన్ డీఎన్ఏలోనే విధ్వంసం అనే విషం

అమరావతి: ఏపీని ఐదేళ్లు పట్టి పీడించిన భూతం లేనందుకు రాష్ట్ర ప్రజలు రెట్టింపు ఉత్సాహంతో దీపావళి చేసుకున్నారని తెదేపా ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. వైకాపా ఎన్ని కుట్రలు పన్నినా ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధి ఇక ఆగదనే నమ్మకం ప్రజల్లో కనిపించిందని చెప్పారు. తెదేపా కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

తమ పార్టీకి, తమకు ఇక రాజకీయ భవిష్యత్తు లేదనే ఆందోళన వైకాపా నేతల మాటల్లో కనిపిస్తోందన్నారు. "ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పినందునే వైకాపా 151 నుంచి 11కి పడిపోయింది. ఇంకా రప్పా రప్పా అని విర్రవీగితే వచ్చే ఎన్నికల్లో ఆ 11 కూడా రావు. వైకాపా నేతలు రాజకీయ పార్టీని కాకుండా ఓ దొంగల ముఠాను నడుపుతున్నారు. జగన్ కుట్రలను ప్రజలు గ్రహించి వైకాపాను 53 గ్రేడ్ సిమెంట్‌తో పాతరేసి మళ్లీ పైకి లేవకుండా చేశారు. వైకాపా, జగన్ డీఎన్ఏలోనే విధ్వంసం అనే విషం ఉంది.

ఏ శాస్త్రవేత్త, వైద్యుడు కూడా మందు కనిపెట్టని ఈ విషం.. వైద్యానికో, ఆపరేషన్‌కో నయమయ్యేది కాదు. ఎన్నికలు వచ్చినప్పుడల్లా ప్రజలే వైద్యులుగా మారి ఆ విషం మళ్లీ రాష్ట్రానికి రాకుండా చూడాలి. గూగుల్ డేటా సెంటర్‌తో వైకాపా నేతల పిల్లలు కూడా బాగుపడతారని తెలిసినా విషం చిమ్ముతున్నారు. వైకాపా హయాంలో జరిగిన మద్యం కుంభకోణం నుంచి దృష్టి మళ్లించేందుకే నకిలీ మద్యాన్ని సృష్టించేందుకు కుట్ర పన్నారు. అధికారం, డబ్బు కోసం తల్లి, చెల్లితో పాటు ఎవరి మధ్య అయినా చిచ్చు పెట్టేందుకు జగన్ వెనుకాడరు. ఏపీ, అమరావతిపై విషం చిమ్మడం ఇకనైనా మానుకోకపోతే వైకాపాకు మళ్లీ చావు దెబ్బ తప్పదు" అని యరపతినేని హెచ్చరించారు.




## తిరుమలలో కుండపోత

## తిరుమలలో కుండపోత.. భారీ వర్షంతో భక్తులకు ఇబ్బందులు

తిరుమల: తిరుమలలో భారీ వర్షం కురుస్తోంది. శ్రీవారి ఆలయ ప్రాంగణంతో పాటు పరిసర ప్రాంతాలు తడిచి ముద్దయ్యాయి. ఎడతెరిపిలేకుండా వర్షం కురుస్తుండటంతో శ్రీవారి దర్శనం, గదులు, లడ్డూల కోసం వెళ్లే భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. చలికి చిన్నారులు, వృద్ధులు వణుకుతున్నారు. శ్రీవారి ఆలయం ముందు నీరు నిలిచిపోయింది. ఘాట్ రోడ్లలో కొండ చరియలు విరిగిపడే ప్రమాదం ఉన్నందున తితిదే అప్రమత్తమైంది. పాపవినాశనం, ఆకాశగంగ, శ్రీవారి పాదాలు, ఘాట్ రోడ్లలో జాగ్రత్త చర్యలు చేపట్టింది.

## నైరుతి బంగాళాఖాతంలో అల్పపీడనం.. ఏపీ వ్యాప్తంగా ఎల్లో అలెర్ట్ జారీ



అమరావతి: నైరుతి బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడింది. ఇది పశ్చిమ వాయవ్యంగా కదిలి 36 గంటల్లో వాయుగుండంగా మారే అవకాశం ఉంది. ఈ కారణంగా ఏపీ వ్యాప్తంగా వాతావరణ శాఖ ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. ఇవాళ ఒంగోలు, నెల్లూరు, తిరుపతి, కడప జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురుస్తాయని తెలిపింది. బుధవారం రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని.. ఆరెంజ్ అలెర్ట్ జారీ చేయనున్నట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

## ఏం జరిగినా పవన్‌కు అంటగట్టే ప్రయత్నం: వైసీపీపై జనసేన నేత ఆగ్రహం



గుంటూరు : నెల్లూరు జిల్లా కందుకూరు నియోజకవర్గంలో తిరుమలశెట్టి లక్ష్మయ్యనాయుడు హత్య ఘటనను ఎవరైనా ఖండించాల్సిందే అని జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. ఆ ఘటనకు బాధ్యులైన వారిని ఎవరినీ వదిలిపెట్టేది లేదని స్పష్టం చేశారు. గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారికి జనసేన పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఏం జరిగినా దానిని జనసేన పార్టీకి, అధినేత పవన్ కళ్యాణ్‌కు అంటగట్టే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ఒక సిద్ధాంతానికి కట్టుబడి పనిచేసే పార్టీ జనసేన అని స్పష్టం చేశారు. రాజకీయ లబ్ది కోసం కులాలకు అంటగట్టడం సరైన విధానం కాదన్నారు. పవన్ కళ్యాణ్ స్పందించిన ఎన్నో ఘటనల్లో బాధితులకు న్యాయం జరిగిందని గుర్తుచేశారు. చనిపోయిన వ్యక్తి గురించి తాము మాట్లాడటం లేదన్నారు. చంపిన వ్యక్తిని నిలువునా ఉరితీయాలనే నినాదంతో అక్కడికి వెళదామని.. వైసీపీ నాయకులు వస్తారా అని సవాల్ విసిరారు. పలకరింపులను కూడా వైసీపీ నాయకులు రాజకీయం చేస్తున్నారని గాదె వెంకటేశ్వరరావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

## చీరకట్టులో సాంప్రదాయంగా మెరిసిన శృతిహాసన్!

హీరోయిన్లు పొట్టి పొట్టి బట్టలు వేస్తే ఎలా ఉంటుందో తెలియదు కానీ ఒకసారి చీర గానీ లేక లంగా వోనిలో గానీ కనిపిస్తే మాత్రం వారి అందాన్ని వర్ణించడానికి మాటలు కూడా రావు. అంత అద్భుతంగా కనిపిస్తారు.. మామూలుగా చీరకట్టులోనే అందం ఉట్టి పడుతుంది. అలాంటిది హీరోయిన్లు ఇలాంటి చీరకట్టులో మెరిస్తే వారి అందం మరింత రెట్టింపు అవుతుంది. అయితే తాజాగా అలాంటి చీరలోనే మెరిసింది సౌత్ హీరోయిన్ శృతిహాసన్.. తాజాగా శృతిహాసన్ చీరకట్టులో తన ట్రెడిషనల్ స్టైల్ తో మెస్మరైజ్ చేసింది. తాజాగా శృతిహాసన్ సిల్వర్ కలర్ శారీలో మెరిసింది.. సిల్వర్ కలర్ శారీ తో బ్లాక్ కలర్ బ్లౌజ్ ని పెయిర్ చేసి, తన లుక్ ని మరింత ఎలిగేంట్ గా మార్చింది.. సిల్వర్ కలర్ శారీ కి లేటెస్ట్ ట్రెండింగ్ లో ఉన్న జరీ బార్డర్ ట్రెడిషనల్ వైబ్ ని తీసుకువచ్చింది.. శృతిహాసన్ చీరలో ఉన్న ఫోటోలు ఆమె లుక్ కి మరింత రిచ్ నెస్ ని యాడ్ చేసాయి. చీర యొక్క సిల్వర్ టోన్ శృతిహాసన్ అందాన్ని రెట్టింపు చేసింది అని ఈ ఫోటోలు చూసిన నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు.. అలా అద్భుతమైన చీరలో కుందనపు బొమ్మలాగా ఉన్న శృతిహాసన్ ఫోటోలు



ప్రస్తుతం సోషల్ మీడియాని షేక్ చేయడంతో పాటు ఈమె అందానికి ఎంతోమంది బానిసలైపోతున్నారు. చాలామంది హీరోయిన్లు తమలో ఉన్న బోల్డ్ నెస్ ని చూపించడానికి పొట్టి పొట్టి బట్టలు స్టైల్ చేస్తారు. కానీ ఇలాంటి చీరకట్టులోనే వారి అందం మరింత అద్భుతంగా కనిపిస్తుంది అని కామెంట్లు పెడుతున్నారు. శృతిహాసన్ అలా తన కట్టు బొట్టుతో ఇంటర్నెట్ ని షేక్ చేస్తోంది. అలాగే ఈ ఫోటోలకు బ్లాక్ కలర్, వైట్ కలర్ హార్ట్ ఎమోజీలను క్యాప్షన్ గా పెట్టింది. శృతిహాసన్ సినిమాలు, కెరియర్ విషయానికి వస్తే.. విశ్వనటుడిగా పేరు తెచ్చుకున్న కమల్ హాసన్ కూతురే అయినప్పటికీ సొంతంగా ఎదిగింది. మల్టీ టాలెంటెడ్ గా ఇండస్ట్రీలో రాణిస్తున్న ఈ ముద్దుగుమ్మ కేవలం సినిమాల్లో హీరోయిన్ గానే కాదు సింగర్ గా కూడా కొన్ని పాటలు పాడింది. అలా లక్ అనే మూవీతో బాలీవుడ్ లో మొదటిసారి హీరోయిన్ గా ఇమ్రాన్ ఖాన్ సరసన మెరిసినప్పటికీ ఈ మూవీ ఘోర పరాజయం పాలైంది. ఆ తర్వాత ఈమె నటించిన అనగనగా ఓ ధీరుడు, బాలీవుడ్ లో దిల్ తో బచ్చా హై జీ,7 ఓం అరివు, ఓ మై ఫ్రెండ్, 3 వంటి వరుస సినిమాలు ఫ్లాప్ అయ్యాయి. దాంతో శృతిహాసన్ పై ఐరన్ లెగ్ అనే ముద్ర వేసారు.కానీ ఎప్పుడైతే పవన్ కళ్యాణ్ తో గబ్బర్ సింగ్ మూవీ చేసిందో అప్పటినుండి ఈమె దశ తిరిగిందని చెప్పుకోవచ్చు. ఆ తర్వాత వరుస సినిమాల్లో ఆఫర్స్ అందుకొని తెలుగు, తమిళ, హిందీ భాషల్లో రాణిస్తోంది.ఇక ఈ హీరోయిన్ ఈ ఏడాది కూలీ అనే మూవీతో మన ముందుకు వచ్చింది. ఇక ప్రస్తుతం ఈ హీరోయిన్ చేతిలో సలార్-2 సినిమా ఉంది.అలాగే అడివి శేష్ డెకాయిట్ మూవీలో నటించి కొంతవరకు షూటింగ్ అయ్యాక ఏవో కారణాలవల్ల అందులో నుండి తప్పుకోవడంతో శృతిహాసన్ ప్లేస్ ని మృణాల్ ఠాకూర్ రీప్లేస్ చేసింది.

## పాపం రాధిక.. హీరోయిన్‌కి తక్కువ గెస్ట్‌కి ఎక్కువ

టాలీవుడ్‌లో మెహబూబా సినిమాతో అడుగు పెట్టిన నేహా శెట్టి కెరీర్ ఆరంభం నుంచి ఒడిదొడుకులు ఎదుర్కొంది. అయితే లక్కీగా సిద్దు జొన్నలగడ్డ సూపర్ హిట్ మూవీ డీజే టిల్లు సినిమాలో రాధిక పాత్రను పోషించడం ద్వారా అందరి దృష్టిని ఆకర్షించింది. ఆ సినిమా సూపర్ హిట్ కావడంతో పాటు, రాధిక పాత్ర గురించి ఇప్పటికీ చర్చ జరుగుతూనే ఉంది. సాధారణంగానే సిద్దు జొన్నలగడ్డ సినిమాలకు మాస్ ఆడియన్స్‌లో మంచి ఆధరణ ఉంటుంది. అలాంటి హీరోకు జోడీగా నటించడం ద్వారా రాధిక మంచి బ్రేక్ దక్కించుకుంటుందని అంతా భావించారు. కానీ డీజే టిల్లుతో పాటు టిల్లు స్క్వేర్ సినిమాలో నటించినా కూడా నేహా శెట్టికి బ్రేక్ దక్కలేదు. అందంతో పాటు, అభినయం ఉన్న ఈ అమ్మడికి లక్ కలిసి రాకపోవడంతో చేసిన సినిమాలు బాక్సాఫీస్ వద్ద విజయాన్ని సొంతం చేసుకున్నా బ్రేక్ దక్కడం లేదు. గత ఏడాది టిల్లు స్క్వేర్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన నేహా శెట్టి మరోసారి రాధికగా అలరించింది. కానీ ఆ సినిమా నేహా శెట్టికి మరిన్ని ఆఫర్లు తెచ్చి పెట్టలేదు. అందులో నేహా శెట్టి పాత్ర



గెస్ట్ రోల్‌కే పరిమితం అయింది. అనుపమ పరమేశ్వరన్ టిల్లు స్క్వేర్‌లో హీరోయిన్‌గా నటించి డామినేట్ చేసింది. అందుకే నేహా శర్మ పాత్రకు పెద్దగా ప్రాధాన్యత దక్కలేదు. కానీ లక్కీగా విశ్వక్ సేన్ తో కలిసి ఈమె గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి సినిమాలో నటించింది. ఆ సినిమాలో అందంతో పాటు అభినయంతో మెప్పించింది.

అయినా కూడా మరిన్ని ఆఫర్లు ఈ అమ్మడి తలుపు తట్టలేదు. దాంతో ఈమె కెరీర్ ఖతం అని అంతా భావిస్తున్నారు. ఇలాంటి సమయంలో కోలీవుడ్‌లో ఈ అమ్మడికి మొదటి అవకాశం దక్కింది. చాలా మంది కోలీవుడ్‌లో ఈమె కెరీర్ గురించి పెద్దగా ఊహించేసుకున్నారు. కానీ తీవ్రంగా నిరాశ పరిచిందని చెప్పాలి.

**ప్రదీప్ రంగనాథన్‌కి జోడీగా..** కోలీవుడ్ హ్యాపెనింగ్ హీరో ప్రదీప్ రంగనాథన్ నటించిన డ్యూడ్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన విషయం తెల్సిందే. హీరోయిన్‌గా మమిత బైజు నటించింది. అయితే ట్రైలర్‌లో, ప్రమోషనల్ స్టఫ్‌లో నేహా శెట్టి కనిపించడంతో డ్యూడ్‌లో లక్కీగా ఈ అమ్మడికి ఛాన్స్ దక్కింది. ఇక కోలీవుడ్‌లో రాధిక దున్నేయడం ఖాయం అని అంతా అనుకున్నారు. కానీ డ్యూడ్ సినిమా విడుదల తర్వాత ఆమె సన్నిహితులు, అభిమానులు, ఆమె గురించి మాట్లాడుకున్న వారు అంతా కూడా నోరు వెళ్లబెట్టారు. డ్యూడ్ సినిమాలో ఈ రాధిక కనిపించింది చాలా తక్కువ సమయం అనాలి. అలాంటి పాత్రను చాలా ముఖ్యమైన పాత్ర, కెరీర్ సెటిల్ అయ్యే పాత్ర అంటూ కొందరు వ్యాఖ్యలు చేయడం విడ్డూరంగా అనిపించింది. నేహా శెట్టి ఈ పాత్రతో కోలీవుడ్‌లో మరిన్ని ఆఫర్లు దక్కించుకుంటుందా అంటే ఖచ్చితంగా కష్టమే అని చెప్పాలి.




## బాస్ గ్రేస్‌కు ఫిదా.. 'మీసాల పిల్ల' రికార్డుల మోత!



మెగాస్టార్ చిరంజీవి, బ్లాక్‌బస్టర్ డైరెక్టర్ అనిల్ రావిపూడి.. ఈ కాంబో అనౌన్స్ అయినప్పటి నుంచే ఫ్యాన్స్‌లో ఒకటే క్యూరియాసిటీ. వింటేజ్ చిరును మళ్లీ తెరపై చూపిస్తానని అనిల్ మాటివ్వడంతో, 'మన శంకర వరప్రసాద్ గారు' చిత్రంపై అంచనాలు హై లెవెల్ కు వెళ్లాయి. ఆ అంచనాలకు తగ్గట్టే, సినిమా మ్యూజికల్ ప్రమోషన్స్ ఒక సెన్సేషన్‌తో మొదలయ్యాయి. 'మన శంకర వరప్రసాద్ గారు' నుంచి ఫస్ట్ సింగిల్‌గా వచ్చిన 'మీసాల పిల్ల' పాట, విడుదలైన క్షణం నుంచే మ్యూజిక్ లవర్స్‌ను ఒక ఊపు ఊపేస్తోంది. ఈ పాటలో చిరంజీవి చూపించిన సిగ్నేచర్ గ్రేస్, కొంటెతనం, ప్లేఫుల్ యాటిట్యూడ్.. ఫ్యాన్స్‌కు నిజంగా ఒక విజువల్ ట్రీట్. చాలా కాలం తర్వాత బాస్‌లోని ఆ ఈజ్‌ను చూసి అందరూ ఫిదా అయిపోతున్నారు. వరుసగా సోషల్ మీడియాలో రీల్స్ చేస్తూ మరింత ట్రెండ్ చేస్తున్నారు. మొదట్లో కొందరు ఇది క్రింజ్ లాగా ఉందని అన్నారు, కానీ మెల్లగా ఫ్యామిలి ఆడియెన్స్ కు కనెక్ట్ కావడంతో సాంగ్ రేంజ్ మరింత పెరిగిపోయింది. ఇప్పుడు ఈ సాంగ్ మరో సాలిడ్ మైల్‌స్టోన్‌ను క్రాస్ చేసింది. యూట్యూబ్‌లో ఏకంగా 25 మిలియన్లకు పైగా వ్యూస్‌తో దూసుకుపోతోంది. ఇది కేవలం నంబర్ మాత్రమే కాదు, ఈ పాట ఎంతలా జనాల్లోకి వెళ్లిందో చెప్పడానికి ఒక పర్ఫెక్ట్ ఉదాహరణ. ప్రతీ చోటా ఈ పాటే వినిపిస్తూ, సోషల్ మీడియా రీల్స్‌లో ట్రెండ్ అవుతోంది. కేవలం వ్యూస్ మాత్రమే కాదు, ఈ పాట ప్రస్తుతం యూ ట్యూబ్ ఇండియా మ్యూజిక్ కేటగిరీలో నంబర్ 1 స్థానంలో ట్రెండ్ అవుతోంది. ఒక రీజినల్ సినిమా పాట దేశవ్యాప్తంగా టాప్‌లో ట్రెండ్ అవ్వడం, చూస్తుంటే బాస్ మేనియా ఏ లెవెల్లో ఉందో అర్థం చేసుకోవచ్చు. ఈ పాటలో చిరంజీవి సరసన నయనతార నటిస్తుండగా, భీమ్స్ సిసిరోలియో అందించిన క్యాచీ ట్యూన్, మెలోడీ ఈ సక్సెస్‌కు మరో కారణం. అలాగే ఉదిత్ నారాయణ వాయిస్ కూడా పాటకు మరింత క్రేజ్ తెచ్చిందని చెప్పవచ్చు. షైన్ స్క్రీన్స్, గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లు ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నాయి. ఒక్క పాటకే ఈ రేంజ్ రెస్పాన్స్ వస్తుందంటే, ఇక సినిమా ఏ రేంజ్‌లో ఉండబోతోందో అర్థం చేసుకోవచ్చు. 2026 సంక్రాంతికి థియేటర్లలోకి రాబోతున్న 'మన శంకర వరప్రసాద్ గారు' చిత్రం, ఒక పక్కా ఫెస్టివల్ ఎంటర్‌టైనర్‌గా బాక్సాఫీస్‌ను షేక్ చేయడం ఖాయమని ఈ మ్యూజికల్ సెన్సేషన్ హింట్ ఇస్తోంది. ఇక నెక్ట్స్ రాబోయే సాంగ్స్ టీజర్ కూడా ఇదే రేంజ్ లో ఆకట్టుకుంటాయో లేదో చూడాలి.

## మెగాస్టార్ లుక్కు అదిరింది..!



మెగాస్టార్ చిరంజీవి అనిల్ రావిపూడి కాంబినేషన్ లో వస్తున్న మన శంకర వరప్రసాద్ సినిమా నుంచి దీపావళి పోస్టర్ ఒకటి రిలీజైంది. ఈ పోస్టర్ చూస్తే సైకిల్ మీద మెగాస్టార్ చిరంజీవి మరో ఇద్దరు పాపలు ఆయనతో కలిసి సైక్లింగ్ చేస్తున్నారు. సినిమాలో చిరు స్కూల్ పి.ఈ.టీ అని వార్తలు రాగా ఆమధ్య ప్రెస్ మీట్ లో చిరంజీవి క్యారెక్టర్ లో వేరియేషన్స్ ఉంటాయని అనిల్ రావిపూడి చెప్పాడు.

**మీసాల పిల్ల సాంగ్ చార్ట్ బస్టర్..** ఇక రీసెంట్ గా రిలీజైన మీసాల పిల్ల సాంగ్ చార్ట్ బస్టర్ అయ్యింది. భీమ్స్ మ్యూజిక్ అందించిన ఈ సాంగ్ ని ఉదిత్ నారాయణ పాడటంతో సాంగ్ కి స్పెషల్ క్రేజ్ ఏర్పడింది. సోషల్ మీడియాలో మీసాల పిల్ల సాంగ్ సెన్సేషన్ గా మారింది. ఇక లేటెస్ట్ గా దీపావళి కానుకగా మన శంకర వరప్రసాద్ పోస్టర్ రిలీజ్ చేశారు. ఈ పోస్టర్ లో చిరు చాలా యంగ్ గా కనిపిస్తున్నారు. ఈ లుక్ చూసి మెగా ఫ్యాన్స్ ఖుషి అవుతున్నారు. మెగాస్టార్ చిరంజీవి లుక్స్ అయితే నెక్ట్స్ లెవెల్ అనేలా ఉన్నాయి. అనిల్ రావిపూడి సినిమాలో హీరో పాత్రలు చాలా ఇంప్రెసివ్ గా ఉంటారు. మోస్ట్ ఎంటర్టైనింగ్ డైరెక్టర్ గా తనకు తానుగా ఒక బ్రాండ్ ఏర్పాటు చేసుకున్న అనిల్ రావిపూడి మెగాస్టార్ చిరంజీవిలో కూడా ఆయన వింటేజ్ కామెడీ టైమింగ్ ని మన శంకర వరప్రసాద్ లో చూపించబోతున్నారని తెలుస్తుంది.

**సినిమా ఎలా తీయాలో కాదు ఎలా ప్రమోట్ చేయాలో కూడా..** ఇప్పటికే ఈ సినిమా టీజర్ తో మెగా ఫ్యాన్స్ సినిమాపై ఎక్స్ పెక్టేషన్స్ హై రేంజ్ లో పెట్టుకోగా నెక్ట్స్ సాంగ్ తో మరింత బజ్ పెంచారు. ఒక సినిమా ఎలా తీయాలో కాదు ఎలా ప్రమోట్ చేయాలో కూడా తనకు తెలిసినంతగా ఎవరికీ తెలియదు అన్నట్టుగా మాస్టర్ క్లాస్ గా మారాడు అనిల్ రావిపూడి. సంక్రాంతికి అనిల్ సినిమా అంటే అది కచ్చితంగా సూపర్ హిట్టే అనే రేంజ్ క్రేజ్ తెచ్చుకున్నాడు. మెగాస్టార్ మన శంకర్ వరప్రసాద్ సినిమా టీజర్ తో అదరగొట్టి నెక్ట్స్ సాంగ్ తో క్రేజ్ పెంచేసి ఇప్పుడు దీవాలి పోస్టర్ తో కూడా ఇంపాక్ట్ చూపించారు. సినిమాలో చిరంజీవికి జోడీగా నయనతార హీరోయిన్ గా నటిస్తుంది. భీమ్స్ మ్యూజిక్ కూడా సినిమాకు మరో హైలెట్ అయ్యేలా ఉంది. సంక్రాంతికి మెగా మాస్ ఎంటర్టైనర్ గా మన శంకర వరప్రసాద్ ఫ్యాన్స్ తో పాటు ఆడియన్స్ కి సూపర్ ట్రీట్ ఇచ్చేలా ఉన్నాడు. మన శంకర వరప్రసాద్ లో మరో స్పెషల్ సర్ ప్రైజ్ మన విక్టరీ వెంకటేష్ కూడా క్యామియో రోల్ చేస్తున్నారట. చిరంజీవి, వెంకటేష్ ఇద్దరు లెజెండ్స్ ఒకే స్క్రీన్ పై కనిపిస్తే ఆ కిక్ ఎలా ఉంటుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. అనిల్ చేసే ఆ మ్యాజిక్ చూసేందుకు సంక్రాంతికి త్వరగా రావాలని ఆడియన్స్ భావిస్తున్నారు.

## బాహుబలి.. రీ రిలీజ్ లో ఈ సీన్ పడితే థియేటర్లు బ్లాస్టే!

బాహుబలి తెలుగు సినిమా చరిత్రలో ఓ అద్భుతమైన సినిమా. దర్శకధీరుడు రాజమౌళి తెరకెక్కించిన ఈ సినిమా సరిహద్దుల్ని చెరిపేస్తూ.. ప్రపంచ వ్యాప్తంగా క్రేజ్ తెచ్చుకుంది. జక్కన్న విజన్, సీన్ మేకింగ్ నా భుతో నా భవిష్యత్ అనే రేంజ్ లో ఉంటుందీ సినిమా. ఈ భారీ బ్లాక్ బస్టర్ రిలీజై ఈ ఏడాదికి 10ఏళ్లు పూర్తి చేసుకుంది. ఈ క్రమంలో బాహుబలి రెండు పార్ట్ లను కలిపి ది ఎపిక్ పేరుతో రీ రిలీజ్ చేస్తున్నారు. ఈ సినిమా ఇదే నెల 31న థియేటర్లలోకి రానుంది. ఈ క్రమంలో ఈ సినిమాకు సంబంధించిన వీడియోలు రోజుకొకటి బయటకు వస్తున్నాయి. అప్పుడు సినిమా రిలీజ్ టైమ్ లో ప్రమోషన్స్ లో చెప్పిన విషయాలు, సెట్స్ లో జరిగిన సరదా సంభాషణలు ఇలా రోజుకొకటి సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. తాజాగా జక్కన్న విజన్ ను కళ్లకు కట్టే వీడియో ఒకటి బయటకు వచ్చింది. ఇది చూసిన నెటిజన్లు గుస్ బంప్స్ వస్తున్నాయి అంటూ కామెంట్ చేస్తున్నారు. మరి ఆ వీడియో ఏంటంటే? ఈ వీడియో బాహుబలి తొలి పార్ట్ ప్రమోషన్స్ సమయంలోనిది. ఇందులో ఇంటర్వెల్ సీన్ గురించి రాజమౌళి తాను అనుకున్న విజన్, ఒరిజినల్ గా రావాల్సిన సీన్ గురించి వివరంగా చెబుతుంటారు. కానీ, సినిమాలో



మాత్రం ఆ వెర్షన్ లో లేదు. కొన్ని కారణాల వల్ల ఎడిటింగ్ కటింగ్ లో ఇంకొక వెర్షన్ ఇంటర్వెల్ ను మనకు చూపించారు. కానీ తాను అనుకున్న విజన్ ను జక్కన్న ఆ ఇంటర్వ్యూలో చెబుతుంటారు. బాహుబలిని చూశామంటూ సైనికుడు బిజ్జలదేవుడి దగ్గరకు వచ్చి చెప్తాడు. అప్పుడు బిజ్జలదేవుడు సైనితుడితో.. ఎక్కడ నుంచి వస్తాడురా బాహుబలి. వాడు లేడు చచ్చిపోయాడు. వాడి ప్రాణాలను మట్టిలో కలిపేశాం, అనగానే ఇంట్రో కట్ లో బాహుబలి భూమిని చీల్చుకుంటూ వస్తాడు. ఆ తర్వాత శరీరాన్ని కాల్చి మంటల్లో కలిపేశాం అనగానే మంటలు దాటుకొని వస్తాడు. అలా బిజ్జలదేవుడు చెప్పే డైలాగ్ కు ఒక్కో ఎలిమెంట్ నుంచి బాహుబలి వస్తాడు. ఫైనల్ గా బాహుబలి లేడు, చచ్చిపోయాడు అనగానే ప్రభాస్ ల్యాండ్ అవుతాడు. అప్పుడు దేవసేన మాహిష్మతి ఊపిరి పీల్చుకో నా కొడుకు వచ్చాడు. అనే డైలాగ్ ఉంటుంది. ఇది నేను రాసుకున్న ఒరిజినల్ విజన్ అని జక్కన్న చెబుతాడు. ఈ వీడియో ఇప్పుడు వైరల్ కావడంతో ఫ్యాన్స్ జక్కన్న విజన్ కు అనుగునంగా ఎడిట్ చేసి వీడియో వైరల్ చేస్తున్నారు. అయితే ఇప్పుడు రీ రిలీజ్ లో మాత్రం ఇదే విజన్ ఉండాలని డిమాండ్ చేస్తున్నారు. ఒకవేళ ఈ ఒరిజినల్ సీన్ గనుక స్క్రీన్ పై పడితే థియేటర్లు బద్దలైపోవడం పక్కా అంటూ డార్లింగ్ ఫ్యాన్స్ కామెంట్ చేస్తున్నారు. మరి చూడాలి బాహుబలి ది ఎపిక్ లో ఎలాంటి సీన్స్ తీసేశారు? ఏయే సీన్స్ యాడ్ చేశారో తెలియాలంటే ఈనెల 31 గాకా ఆగాల్సిందే!

## బ్లాక్‌లో బ్యూటీ అందాల ఆరబోత

విరాట్ కోహ్లీ పొరపాటున ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక్క లైక్ కొట్టిన కారణంగా ఓవర్ నైట్‌లో స్టార్‌గా గుర్తింపు దక్కించుకున్న ముద్దుగుమ్మ అవనీత్ కౌర్. ఈ అమ్మడు బాలీవుడ్‌లో ఎంట్రీ ఇచ్చి చాలా కాలం అయింది, అంతకు ముందు సోషల్ మీడియాలో, మోడల్‌గా రాణించే ప్రయత్నం చేసింది. కానీ ఎప్పుడూ రాని గుర్తింపు, ఎప్పుడూ దక్కని సోషల్ మీడియా ఫాలోయింగ్ కేవలం విరాట్ కోహ్లీ పొరపాటున కొట్టిన లైక్ కారణంగా వైరల్ అయింది. సాంకేతిక లోపం కారణంగా అవనీత్ కౌర్ ఫోటోకు కోహ్లీ నుంచి లైక్ పడిందని ఆ తర్వాత అధికారికంగా ప్రకటన వచ్చింది. అప్పటికే జరగాల్సింది జరిగిపోయింది. అవనీత్ గురించి జాతీయ స్థాయిలో మాట్లాడుకోవడం జరిగింది, ఆమె అందరికి సుపరిచితురాలు అయింది. సోషల్ మీడియాలో ఒక్కసారిగా లక్షల్లో ఫాలోవర్స్ సంఖ్య పెరగడం జరిగింది.



**అవనీత్ కౌర్ సోషల్ మీడియాలో..** ఇన్‌స్టాగ్రామ్‌లో ఏకంగా 31 మిలియన్‌ల ఫాలోవర్స్‌ను ఈ అమ్మడు దక్కించుకోవడం వెనుక ఖచ్చితంగా విరాట్ కోహ్లీ లైక్ కారణం అంటూ చాలా మంది అంటూ ఉంటారు. తనకు సడెన్‌గా వచ్చిన ఫాలోయింగ్‌ను కొనసాగించుకునేందుకు ఈ అమ్మడు అందాల ఆరబోత ఫోటోలు రెగ్యులర్‌గా షేర్ చేస్తూ వస్తోంది. ఆకట్టుకునే అందంతో పాటు, మంచి ఫిజిక్ ఉన్న ఈ అమ్మడు రెగ్యులర్‌గా అందాల ఆరబోత ఫోటోలు షేర్ చేస్తూ వస్తుంది. తాజాగా బ్లాక్ డ్రస్‌లో ఈ అమ్మడు షేర్ చేసిన ఈ ఫోటోలు వైరల్ అవుతున్నాయి. బాలీవుడ్ హీరోయిన్స్ సైతం ఈమె ముందు తక్కువే అన్నట్లుగా చాలా మంది కామెంట్స్ చేస్తున్నారు. ఈ స్థాయిలో అందాల ఆరబోత చేస్తున్న అవనీత్ కౌర్ కి రావాల్సిన ఆఫర్లు రావడం లేదు, దక్కాల్సిన గుర్తింపు దక్కడం లేదు అంటూ చాలా మంది ఆమె ఫాలోవర్స్ అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



# మిగతా మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలవాలి

హైదరాబాద్: శాంతి భద్రతలను కాపాడటంలో పోలీసులు ప్రాణాలను సైతం పణంగా పెడుతున్నారని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. గోషామహల్ పోలీసు గ్రౌండ్స్‌లో పోలీసు అమరవీరుల సంస్మరణ కార్యక్రమానికి సీఎం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విధి నిర్వహణలో వీర మరణం పొందిన పోలీసులకు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా 'అమరులు వారు' పుస్తకాన్ని సీఎం ఆవిష్కరించి.. తొలి ప్రతిని డీజీపీ శివధర్‌కు అందించారు. "ఏటా ఈరోజు పోలీసు అమరవీరులను స్మరించుకుంటున్నాం. పోలీసు అంటే సమాజానికి నమ్మకం, భరోసా. మనకోసం ప్రాణాలు అర్పించిన అమరవీరులు ఎందరో ఉన్నారు. అమరులైన పోలీసు కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుంది. ఇటీవల చనిపోయిన ప్రమోద్ కుటుంబానికి అన్ని విధాలుగా సాయం చేస్తాం. పోలీసు అమరవీరుల కుటుంబాలకు ఇంటిస్థలం కేటాయిస్తున్నాం. పలు విభాగాల్లో మన పోలీసులు దేశంలోనే అగ్రస్థానంలో ఉన్నారు. అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా పోలీసులు అడ్డుకుంటున్నారు. డ్రగ్స్ మహమ్మారిపై పోరాడేందుకు ఈగల్ పేరుతో బృందాలను నియమించాం. ఇటీవల అనేక మంది మావోయిస్టులు పోలీసుల ఎదుట లొంగిపోయారు. జనజీవన స్రవంతిలో కలవాలని మిగతా మావోయిస్టులనూ కోరుతున్నా" అని సీఎం తెలిపారు.



# సీఎం రేవంత్‌రెడ్డితో కొండా సురేఖ దంపతుల భేటీ

హైదరాబాద్: మంత్రి కొండా సురేఖ దంపతులు సోమవారం సీఎం రేవంత్‌రెడ్డితో సమావేశమయ్యారు. జూబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో భేటీ అయ్యారు.

ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌లు కొండా దంపతులను సీఎం నివాసానికి తీసుకెళ్లారు. మంత్రి ఓఎస్డీగా ఉన్న సుమంత్‌ను ఇటీవల తొలగించడం, ఆయన కోసం పోలీసులు మంత్రి ఇంటికి వెళ్లడం తదితర పరిణామాలు చర్చనీయాంశంగా మారిన విషయం తెలిసిందే.

**ఇదీ వివాదం...** మంత్రి కొండా సురేఖ దంపతులు, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిల మధ్య వివాదం మొదలైంది. మేడారం టెండర్ల పంచాయతీ, డక్కన్ సిమెంట్ యాజమాన్యాన్ని బెదిరించినట్లు ఆరోపణలపై కొండా సురేఖ ఓఎస్‌డి సుమంత్‌ను తొలగించడం తీవ్ర వివాదాస్పదంగా మారింది. ఆయన కోసం పోలీసులు సురేఖ నివాసానికి వెళ్లడం, అక్కడ మంత్రి కుమార్తె సుస్మిత అడ్డుకోవడమూ తీవ్ర చర్చకు దారితీసింది. వీటన్నింటిపై ఏఐసీసీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన నేపథ్యంలో.. ఇప్పుడు సీఎం రేవంత్‌తో కొండా దంపతులు భేటీ అయ్యారు.



# నామినేషన్ దాఖలు చేసిన భాజపా అభ్యర్థి

హైదరాబాద్: జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కోసం భాజపా అభ్యర్థి లంకల దీపక్ రెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. తొలుత వెంకటగిరిలోని విజయదుర్గ పోచమ్మ ఆలయంలో దీపక్ రెడ్డితో కలిసి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడి నుంచి భారీ ర్యాలీగా షేక్‌పేట తహశీల్దార్ కార్యాలయానికి వెళ్లి నామినేషన్ వేశారు. 2023 ఎన్నికల్లోనూ దీపక్‌రెడ్డి జూబ్లీహిల్స్ భాజపా అభ్యర్థిగా పోటీ చేశారు. ప్రస్తుతం హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడిగా ఉన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నామినేషన్లకు నేడే చివరి రోజు. ఇవాళ మధ్యాహ్నం 12 గంటల వరకు 13 నామినేషన్లు దాఖలైనట్లు అధికారులు తెలిపారు.



# దేశవ్యాప్త బంద్..

## కేంద్రంపై మండిపడ్డ మావోయిస్టులు.. మరో సంచలన నిర్ణయం

రాయ్‌పూర్ : దేశంలో మావోయిస్టుల నిర్మూలన కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న వైఖరిపై ఆ పార్టీ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆ క్రమంలో అక్టోబర్ 24వ తేదీన దేశవ్యాప్త బంద్‌కు మావోయిస్ట్ పార్టీ పిలుపునిచ్చింది. ఈ మేరకు అభయ్ పేరుతో కేంద్ర కమిటీ మంగళవారం ఒక లేఖను విడుదల చేసింది. కార్పొరేట్ల ప్రయోజనాల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కగార్ యుద్ధాన్ని సాగిస్తూ.. మావోయిస్టులను హత్య చేయడానికి నిరసనగా ఈ బంద్‌కు పిలుపునిచ్చినట్లు కేంద్ర కమిటీ విడుదల చేసిన ఆ లేఖలో పేర్కొంది. మావోయిస్టుల హత్యలకు నిరసనగా అక్టోబర్ 23వ తేదీ వరకు నిరసన వ్యక్తం చేయాలని ఆ పార్టీ స్పష్టం చేసింది. ఆపరేషన్ కగార్ నిలిపి వేయడానికి దేశవ్యాప్తంగా ప్రజా ఉద్యమం నిర్మించాలని ఆ లేఖలో సూచించింది. 2026, మార్చి నెలాఖరు నాటికి మావోయిస్టులను శాశ్వతంగా నిర్మూలించి.. మావోయిస్ట్ రహిత భారత్‌గా మారుస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. అందులో భాగంగా కేంద్రం ఆపరేషన్ కగార్ చేపట్టి.. వ్యూహాత్మకంగా అడుగులు వేస్తుంది. ఆ క్రమంలో మావోయిస్టులు లొంగిపోయి.. జన జీవన స్రవంతిలో కలిసిపోవాలని కేంద్రం పిలుపునిచ్చింది. దాంతో వందల సంఖ్యలో మావోయిస్టులు ప్రభుత్వం ఎదుట లొంగిపోయారు. ఇక దేశంలోని ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, జారండ్ మినహా మిగతా అన్ని రాష్ట్రాలు మావోయిస్టు రహితంగా మారాయి. అయితే ఛత్తీస్‌గఢ్‌లో మాత్రం మావోయిస్టులు బలంగా ఉన్నారు. దీంతో ఆ రాష్ట్రంలో కేంద్ర, రాష్ట్ర బలగాలు.. నిరంతరాయంగా కూంబింగ్ నిర్వహిస్తున్నాయి. దాంతో వరుస ఎన్‌కౌంటర్లు చోటు చేసుకుని.. పలువురు మావోయిస్టు అగ్రనేతలు మరణించారు. అలాగే వందల మంది మావోయిస్టులు సైతం మృతి చెందారు. భారీగా మావోయిస్టులు సైతం అరెస్టయ్యారు. ఇంకోవైపు తాజాగా మావోయిస్టు పార్టీలో అగ్రనేతగా ఉన్న మల్లోజులు వేణుగోపాల్ దాదాపు వంద మంది మావోయిస్టులతో కలిసి మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ ఎదుట లొంగిపోయారు. అలాగే ఛత్తీస్‌గఢ్ సీఎం ఎదుట మరో మావోయిస్టు అగ్రనేత ఆశన్న సైతం వందల మందితో కలిసి లొంగిపోయరు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి మావోయిస్టులు భారీగా ఆయుధాలను అప్పగించారు. అయితే మల్లోజుల వేణుగోపాలు, ఆశన్నలు ప్రభుత్వం ఎదుట లొంగిపోవడంపై మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటి నిప్పులు చెరిగింది. ఇది ముమ్మాటికి విప్లవ ద్రోహమంటూ వారిపై మండిపడింది.



# ప్రజారోగ్యాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం గాలికొదిలేసింది

బంజారాహిల్స్: సీఎం రేవంత్‌రెడ్డికి ప్రజల ప్రాణాలంటే లెక్కలేదని మాజీ మంత్రి కేటీఆర్ విమర్శించారు. హైదరాబాద్‌లో బస్తీ దవాఖానాలను భారత రాష్ట్ర సమితి పరిశీలించింది. ఇందులో భాగంగా ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ బంజారాహిల్స్ గురు బ్రహ్మ నగర్‌లోని బస్తీ దవాఖానాకు వెళ్లారు. వైద్యురాలితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. "ప్రజారోగ్యాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం గాలికి వదిలేసింది. హైదరాబాద్ నగరం చెత్తా చెదారంతో నిండిపోయింది. ఉచితంగా వైద్య పరీక్షలు అందించే టీ-డయోగ్నోస్టిక్స్‌ను పక్కన పెట్టేశారు. బస్తీ దవాఖానాల వైద్యులకు 4 నెలలుగా జీతాలు ఇవ్వడం లేదు. మేం చేపట్టిన టిమ్స్ ఆస్పత్రులను ఈ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోంది. త్వరలో టిమ్స్ ఆస్పత్రుల వద్ద ధర్నా చేస్తాం" అని అన్నారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై కేటీఆర్ విమర్శలు చేశారు. "భారత రాష్ట్ర సమితి నుంచి గెలిచిన దానం ఏ పార్టీలో ఉన్నారో అందరికీ తెలుసు. కాంగ్రెస్ పార్టీ క్యాంపెయినర్స్ జాబితాలో ఆయన పేరు చేర్చడం సిగ్గుచేటు. పార్టీ మారలేదంటూ స్పీకర్ వద్ద అబద్ధాలు చెబుతున్నారు. ఏఐసీసీ అంటే.. ఆల్ ఇండియా కరప్షన్ కమిటీ" అని విమర్శించారు. బస్తీ దవాఖానాల్లో కనీస వసతులు లేవని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. అక్కడికి వెళ్లాలంటేనే పేదలు భయపడుతున్నారన్నారు. ఆరోగ్యశ్రీ బిల్లులు భారీగా పేరుకుపోయాయని ప్రభుత్వంపై ఆయన ధ్వజమెత్తారు.



# కాంగ్రెస్ పాలనలో.. బస్తీ దవాఖానలకు సుస్తీ

## సర్కార్‌కు బుద్ధి రావాలంటే జూబ్లీహిల్స్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించాలి: హరీశ్

హైదరాబాద్ : బస్తీలో ఉండే ప్రజలు ఆరోగ్యవంతంగా ఉండేందుకు కేసీఆర్ బస్తీ దవాఖానలు ప్రారంభించారని బీఆర్ఎస్ మాజీ మంత్రి హరీశ్ రావు గుర్తుచేశారు. కాంగ్రెస్ పాలనలో బస్తీ దవాఖానలకు సుస్తీ పట్టిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి సర్కార్‌కు బుద్ధి రావాలంటే జూబ్లీహిల్స్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించాలని కోరారు. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి నియోజకవర్గం ఓల్డ్ లింగంపల్లి బస్తీ దవాఖానను ఆయన సందర్శించి మాట్లాడారు. 'బస్తీ ప్రజలకు ఇబ్బంది కలగవద్దు. తమ గడప దగ్గరనే, తమ వాకిట్లోనే వైద్యం అందించాలని ఉద్దేశ్యంతో దేశంలోనే మొట్టమొదటిసారిగా బస్తీ దవాఖానలను బీఆర్ఎస్ హయాంలో ప్రారంభించడం జరిగింది.' అని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ హయాంలో రాష్ట్రవ్యాప్తంగా 450 బస్తీ దవాఖానలు ఏర్పాటు చేస్తే..ఒక్క హైదరాబాదులోనే 350 బస్తీ దవాఖానలు ఏర్పాటు చేశామని హరీశ్ చెప్పారు. తమ హయాంలో 110 రకాల మందులు ఉచితంగా అందించే వాళ్ళమని పేర్కొన్నారు. 130 రకాల పరీక్షలను ఉచితంగా చేసి పేషంట్ల ఫోన్ లకే రిపోర్టులు పంపించే వాళ్ళమని వివరించారు. ఆరు నెలల నుండి జీతం రావడం లేదని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిపారు. బస్తీ దవాఖానలో పనిచేసే సిబ్బందికి ఆరు నెలల నుంచి జీతాలు రాకపోతే వారు పని ఎలా చేస్తారు? అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం చెప్పేదొకటి చేసేదొకటని ఎద్దేవా చేశారు. ఒకటో తారీకు అందరికీ జీతాలు ఇస్తామని చెప్తున్నా.. కాంగ్రెస్ ప్రభుత్వం బస్తీ దవాఖానాలో పనిచేస్తున్న సిబ్బందికి ఆరు నెలల నుంచి జీతం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం 60, 70 రకాల మందులు మాత్రమే అందుబాటులో ఉన్నాయని.. 40 రకాల మందులు సప్లై లేదని హరీశ్ మండిపడ్డారు. ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గంలో 108 సర్వీస్ సకాలంలో రాకపోవడం వల్ల, వైద్యం అందకపోవడం వల్ల మనిషి ప్రాణం పోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. హాస్పిటల్లో కేసీఆర్ కిట్టు ఇవ్వకపోవడం వల్ల 20% డెలివరీలు ప్రైవేటు ఆసుపత్రికి బదిలీ అయ్యాయని చెప్పారు. కేసీఆర్ మీద కోపంతో పథకాలను బంద్ చేస్తే పేద ప్రజలు ఇబ్బంది పడుతున్నారని మండిపడ్డారు. ఎంతసేపు మద్యం దుకాణాలు పెంచుదామా, సారా ఎట్లా అమ్ముదామా, పైసలు ఎట్ల సంపాదిద్దామా, అని తప్ప రేవంత్ రెడ్డికి వేరే ఆలోచన లేదన్నారు. వైన్ షాపుల టెండర్లకు రెండు లక్షల నుండి మూడు లక్షలకు పెంచి అడ్డగోలుగా డబ్బు సంపాదించాలని రేవంత్ రెడ్డి చూస్తున్నాడని ఆరోపించారు. జనం తాగాలె ఊగాలె రేవంత్ రెడ్డి కిట్టి నిండాలె కానీ.. ఒకనాడు అయినా ప్రజా ఆరోగ్య వ్యవస్థపై రివ్యూ చేసావా రేవంత్ రెడ్డి? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలనలో బస్తీ ప్రజలు కూడా ప్రశంసించడం లేదన్నారు. తమ హాయంలో ప్రైవేట్ ఆసుపత్రిలో ఆరోగ్యశ్రీ బకాయిలు చెల్లించకపోతే సేవలు నిలిపివేస్తామని హెచ్చరించాయన్నారు. కేసీఆర్ ప్రభుత్వం ఆరోగ్యశ్రీ కింద రూ. 7,000 కోట్ల చెల్లింపులు చేసిందని గుర్తు చేశారు. రూ. 3000 కోట్లు సీఎంఆర్ఎఫ్ కింద అప్పటికి ప్రభుత్వం అందించిందని గుర్తు చేశారు. ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్, జర్నలిస్ట్ హెల్త్ స్కీమ్ పనిచేయడం లేదన్నారు.

# హరీష్‌కు మంత్రి అడ్లూరి ఛాలెంజ్



హైదరాబాద్, అక్టోబర్ 21: మాజీ మంత్రి హరీష్ రావుకు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ఛాలెంజ్ విసిరారు. కేబినెట్‌పై బీఆర్ఎస్ నేతలు అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని.. కేబినెట్ సమావేశంలో వ్యక్తిగత అంశాలు చర్చ చేయలేదని తాను ప్రమాణం చేస్తానని మంత్రి స్పష్టం చేశారు. అలాగే ఈ వ్యవహారంపై మాజీ మంత్రికి సవాల్ విసిరారు మంత్రి. 'సిద్దిపేట వెంకటేశ్వర ఆలయంలో ప్రమాణం చేద్దామా? హరీష్ సెంటిమెంట్‌గా భావించే దేవుడిపై ప్రమాణం చేయగలడా? ఇద్దరం తడిబట్టలతో ప్రమాణం చేద్దామా? మా తల్లి తండ్రులపై ప్రమాణం చేసి నేను ప్రమాణం చేస్తాను. నేను ముఖ్యమంత్రి అనుమతి తీసుకొని వస్తాను. నువ్వు (హరీష్) ఆరోపించిన విషయాలను నిజమని ప్రమాణం చేయగలవా? ఏ శనివారం వస్తారో హరీష్ రావు చెప్పాలి. ఛాలెంజ్‌ను హరీష్ స్వీకరించాలి. కొండా సురేఖ బిడ్డ.. మా అందరికీ బిడ్డ లాంటిదే' అంటూ మంత్రి అడ్లూరి పేర్కొన్నారు. హరీష్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కేబినెట్ మంత్రులను దండుపాళ్యం బ్యాచ్ అంటారా అంటూ ఫైర్ అయ్యారు. కేబినెట్లో జరగని విషయాలను జరిగాయని ప్రచారం చేయడం దుర్మార్గమని మండిపడ్డారు. అబద్ధాలకు కేరాఫ్ అడ్రస్ బీఆర్ఎస్ పార్టీ అంటూ వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు కాంగ్రెస్ సోషల్ మీడియా కార్యకర్తలపై దాదాపు 600 పైగా ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారని తెలిపారు. ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థులపై గత ప్రభుత్వం క్రూరంగా ప్రవర్తించిందని విమర్శించారు. రైతుల చేతులకు బేడీలు వేసిన చరిత్ర కేసీఆర్ ప్రభుత్వానిదన్నారు. పదేండ్లు మేమే రాజులం తామే మంత్రులం అన్నట్టు వ్యవహరించారని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ దుయ్యబట్టారు.




# గూగుల్ ఆఫీసులో నల్లుల బెడద..

# ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోమ్!

ప్రముఖ టెక్ దిగ్గజ సంస్థ గూగుల్‌కు కూడా నల్లుల బెడద తప్పడం లేదు. దీంతో ఆఫీసును తాత్కాలికంగా మూసివేసి.. ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోమ్ ఇచ్చింది. ఈ మేరకు ఆ సంస్థ ఉద్యోగులకు ఈ మెయిల్స్ పంపించింది. అసలేం జరిగిందంటే.. మాన్‌హట్టన్ చెల్సియా క్యాంపస్‌లోని గూగుల్ ఆఫీసులో ఈ ఘటన చోటుచేసుకుంది. గూగుల్‌కు చెందిన పర్యావరణ, ఆరోగ్యం, భద్రతాధికారులు ఈనెల 19న తమ ఉద్యోగులకు ఓ ఈమెయిల్‌ను పంపించారు. దాని ప్రకారం.. ఆఫీసులో నల్లుల బెడద ఉన్నట్లు స్నీపర్ డాగ్ గుర్తించిందన్నారు. అందుకే ఈ సమస్య పరిష్కారమయ్యే వరకు ఆఫీసుకు రావద్దని తమ ఉద్యోగులకు తెలియజేశారు. ఈ క్రమంలో నల్లుల నివారణకు కార్యాలయం చర్యలు చేపట్టింది. సోమవారం నుంచి ఆయా ఉద్యోగులు తిరిగి కార్యాలయానికి వచ్చేందుకు అనుమతిచ్చింది. ఇక, నల్లులకు సంబంధించి దురద లాంటి లక్షణాలు ఏమైనా బయటపడితే వెంటనే తెలియజేయాలని కోరింది. తమ ఇళ్లల్లో నల్లులు కన్పిస్తే.. వాటి నివారణకు సంబంధించిన ప్రొఫెషనల్స్‌ను సంప్రదించాలని సూచించింది. న్యూయార్క్‌లోని గూగుల్ ఆఫీసులో పెద్ద మొత్తంలో జంతువుల బొమ్మలు ఉంచడం వల్లే ఇది వ్యాపించి ఉండవచ్చని కార్యాలయ వర్గాలు తెలిపాయి. నల్లుల బారినపడి.. ఏవైనా లక్షణాలు కనిపిస్తే దానికి సంబంధించిన నివేదికలు అందజేయాలని ఉద్యోగులకు సూచించింది. దీంతోపాటు పనిచేసే ప్రాంతంలో వాటిని ఎక్కడైనా గుర్తించినట్లయితే తెలపాలని పేర్కొంది. ఇక, న్యూయార్క్‌లోని గూగుల్ ఆఫీసులో నల్లుల బెడద ఘటన చోటుచేసుకోవడం ఇది రెండోసారి. 2010లో కూడా ఇలాంటిదే జరిగింది.

Printed, Published and owned by VISHWANATH V and Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com